వార్తా పత్రికలు,
అధిక సంఖ్యలో పుస్తకముల ముద్రణ కోసం సంప్రదించండి.
9393949345.
విశాఖ సమాచారమ్ ప్రెస్
మల్టీకలర్ వెబ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్

Postal License No. VSP / 96/ 2021 - 23
VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

మీ లక్ష్మీ దీపపు ఒత్తులు
కార్తీక దామోదర స్వామి కొరకు
ఆర్డర్ చేయండి
నేరుగా మీ ఇంటికే అందించ బడతాయి
పువ్వు ఒత్తులు..కాడ ఒత్తులు..365 ఒత్తులు..కమలం ఒత్తులు
9248547596 కశింకోట
Speed Post and APSRTC DOOR DELIVERY....48 to 72 hours లో

RNI No.52722/90 సంపుటి : 33 సంచిక : 48 విశాఖపట్నం, 25 నవంబరు 2022 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

## కర్మయోగి ప్రారంభ షెడ్యూల్‌ను ప్రారంభించిన మోది



గోవా ప్రభుత్వం ఆధ్వర్యం లో జరిగిన రోజ్ గార్ మేళా ను ఉద్దేశించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు న వీడియో సందేశం మాధ్యం ద్వారా ప్రసంగించారు.

కేంద్రీయ స్థాయి లో రోజ్ గార్ మేళా భావన ను ప్రధాన మంత్రి ధన్ తేరస్ రోజు న ఆవిష్కరించారు. ఇది కేంద్ర ప్రభుత్వ స్థాయి లో పది లక్షల ఉద్యోగాల ను కల్పించడం లో నాంది. ఇక అప్పటి నుండి ప్రధాన మంత్రి గుజరాత్, జమ్ము & కశ్మీర్ మరియు మహారాష్ట్ర ప్రభుత్వాల రోజ్ గార్ మేళా లను ఉద్దేశించి ప్రసంగించడం తో పాటుగా ప్రభుత్వం లోని వివిధ విభాగాల లో నూతనం గా నియామకాలు జరిగిన వారందరి కి ఉద్దేశించిన ఆన్ లైన్ ఓరియంటేశన్ కోర్సుల కోసం రూపుదిద్దుకొన్నటువంటి 'కర్మయోగి ప్రారంభ్' మాడ్యూల్ ను కూడా ప్రారంభించారు. అంతకు ముందు రోజు న, ఉద్యోగాల లోకి కొత్త గా చేర్చుకొన్న వారికి దాదాపు గా డెబ్భయ్ ఒక్క వేల నియామక లేఖల ను పంపిణీ చేయడం జరిగింది.

సభికుల ను ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, నియామక పత్రాల ను అందుకొన్న యువత కు అభినందనల ను తెలిపారు. ఇది ఉద్యోగ కల్పన లో గోవా ప్రభుత్వం తీసుకొన్న ఒక ముఖ్యమైన చర్య గా ఉందని ఆయన అన్నారు. రాబోయే నెలల్లో గోవా పోలీసు శాఖ లో, ఇంకా ఇతర విభాగాల లో కొలువు ల భర్తీ కార్యక్రమాలు మరిన్ని జరగనున్నాయని ప్రధాన మంత్రి వెల్లడించారు. "ఇది గోవా పోలీసు బలగాన్ని బలోపేతం చేస్తుందిబీ ఇది పౌరుల కు మరియు పర్యటకుల కు సురక్ష వ్యవస్థ ను పెంపొందింపచేస్తుంది" అని ఆయన అన్నారు.

"గడచిన కొన్ని వారాలు గా దేశం లో వివిధ రాష్ట్రాల లో రోజ్ గార్ మేళాల ను నిరంతరాయం గా నిర్వహించడం జరుగుతోందని, కేంద్ర ప్రభుత్వం కూడా వేల కొద్దీ యువతీ యువకుల కు నౌకరీల ను ఇస్తోంద"ని శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. యువత సశక్తీకరణ కోసం డబల్ ఇంజన్ ప్రభుత్వాల పాలన లో ఉన్న రాష్ట్రాలు వాటి వాటి స్థాయిల లో ఈ తరహా ఉద్యోగ మేళాల ను ఏర్పాటు చేస్తున్నందుకు ప్రధాన మంత్రి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

గత ఎనిమిది సంవత్సరాల లో, గోవా అభివృద్ధి కి కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయల ను పెట్టుబడి గా పెట్టిందని ప్రధాన మంత్రి స్పష్టం చేశారు. గోవా లో నిర్మాణాధీనం లో ఉన్న మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టు లు మరియు సంధాన సంబంధి ప్రాజెక్టు లు చాలా మంది కి ఉపాధి ని కల్పించినట్లు గానే, దాదాపు గా 3వేల కోట్ల రూపాయల ఖర్చు తో రూపుదిద్దుకొని త్వరలో ప్రారంభం కానున్న మోపా లోని విమానాశ్రయం వేల మందికి బ్రతుకుతెరువు తాలూకు ఒక ప్రధానమైనటువంటి మూలం గా మారిందని ఆయన అన్నారు. " 'స్వయంపూర్ణ గోవా' యొక్క దృష్టికోణం ఏమిటి అంటే అది రాష్ట్రం లో మౌలిక సదుపాయాల ను తీర్చిదిద్దుతూనే కనీస సదుపాయాల ను మెరుగుపరచాలదే" అని ప్రధాన మంత్రి అన్నారు. గోవా పర్యటన సంబంధి బృహత్ ప్రణాళిక మరియు విధానం గురించి ప్రధాన మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గోవా అభివృద్ధి కోసం ఒక కొత్త నమూనా తో ముందుకు వచ్చింది. ఈ నమూనా పర్యటన రంగం లో పెట్టుబడి కి గాను కొత్త అవకాశాల ను అందించింది. దీని ద్వారా పెద్ద సంఖ్య లో ఉపాధి కి ఉత్తేజం లభించింది అని ఆయన అన్నారు. గోవా లోని గ్రామీణ ప్రాంతాల కు ఆర్థికపరమైన బలాన్ని ఇవ్వడం కోసం తీసుకొంటున్న చర్యల ను గురించి, సాంప్రదాయిక వ్యవసాయం లో ఉపాధి ని పెంచడానికి తీసుకొంటున్న చర్యల ను గురించి ప్రధాన మంత్రి చెబుతూ, వరి ని, కొబ్బరి ని, జనుము ను మరియు మసాల దినుసులను పండిస్తున్న రైతుల ను, ఇంకా ఫ్రూట్ ప్రాసెసింగ్ ప్రక్రియ ను స్వయంసహాయ సమూహాల తో జత పరచడం జరుగుతోందన్నారు. ఈ ప్రయాస లు గోవా లో ఉపాధి, ఇంకా స్వతంత్రోపాధి సంబంధి నూతన అవకాశాల ను ఎన్నిటినో సృష్టిస్తున్నాయని ఆయన నొక్కిచెప్పారు.

కొత్త గా ఉద్యోగ నియామకం పొందిన వారు గోవా అభివృద్ధి కోసం, అలాగే దేశం అభివృద్ధి కోసం కూడాను శ్రమించవలసింది గా ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు. "మీ యొక్క జీవన కాలం లో అత్యంత ముఖ్యమైనటువంటి 25 సంవత్సరాల కాలం ఇప్పుడు మొదలవుతోంది." అని ప్రధాన మంత్రి అన్నారు. అభివృద్ధి చెందిన భారతదేశం గురించిన తన దృష్టికోణాన్ని

(మిగతా 2లో)

## ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్



ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) 10% రిజర్వేషన్లు కల్పిస్తూ రాజ్యాంగంలోని 103వ సవరణ రాజ్యాంగ చెల్లుబాటును సమర్థిస్తూ ఐదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెల్లడించింది. అయితే ఈ తీర్పును సమీక్షించాలని కోరుతూ కాంగ్రెస్ నేత జయ ఠాకూర్ సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేశారు. రాజ్యాంగంలోని 103వ సవరణను సమర్థిస్తూ 2022, నవంబర్ 7న జస్టిస్ దినేష్ మహేశ్వరి, జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ జెబి పార్దివాలా జారీ చేసిన ఉత్తర్వులను సమీక్షించాలని పిటిషన్ కోరారు.

ప్రత్యేకంగా నిర్ణయించడం వెనుకబడిన తరగతులను మినహాయించాలనే కారణంతో సవరణను పక్కన పెట్టిన భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి యు యు లలిత్, జస్టిస్ రవీంద్ర భట్‌ల వైఖరిని తాము అంగీకరిస్తున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. "భారత రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని మార్చే 103వ రాజ్యాంగ సవరణ తీవ్ర వైరుధ్యం. ఇది ఇంద్ర సాహ్నీ & ఓర్స్. V. యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో SC తీర్పుకు విరుద్ధం తరగతిని ఆర్థిక ప్రమాణాలకు సంబంధించి మాత్రమే. ప్రత్యేకంగా నిర్ణయించడం సాధ్యం కాదు" అని పిటిషన్ లో పేర్కొన్నారు.

సమానత్వ కోడ్ ఈ రిజర్వేషన్ దేశంలో సమానత్వ కోడ్‌ను ఉల్లంఘించడమేనని, ఇది వివక్షకు దారితీస్తుందని పిటిషనర్ పేర్కొన్నారు. మన దేశంలో ఎంతోకాలంగా రిజర్వేషన్లు అమల్లో ఉన్నప్పటికీ.. ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతులకు కల్పించే మొత్తం రిజర్వేషన్లు కేవలం 47.46శాతమేనని అన్నారు. ఇప్పుడు కేవలం ఈడబ్ల్యూఎస్‌కే 10 శాతం రిజర్వేషన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

47.46% మాత్రమే కేంద్ర ప్రభుత్వ సర్వీసుల్లో చాలా కాలంగా రిజర్వేషన్లు అమలులో ఉన్నప్పటికీ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఇతర వెనుకబడిన తరగతుల మొత్తం శాతం 47.46% మాత్రమేనని రివ్యూ పిటిషన్‌లో పేర్కొన్నారు. 3:2 మెజారిటీ వీక్షణతో సుప్రీం కోర్ట్ రాజ్యాంగ బెంచ్ ఇటీవల EWSకి 10% అందించే 103వ రాజ్యాంగ సవరణను సమర్థించింది. అయితే మాజీ CJI లలిత్‌తో పాటు జస్టిస్ S రవీంద్ర భట్ EWS కోటాను వెనుకబడిన తరగతులను మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రంగా కనబడట్లేదు

### 30 మంది పీఠాధిపతుల నిరసన



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీయోగి అతిథేశ్వరానంద పర్వతస్వామి తదితరులు

చంద్రగిరి: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్యాత్మిక కేంద్రంగా కాకుండా వ్యాపార కేంద్రంలా తయారైందని వివిధ రాష్ట్రాలకు చెందిన 30 మంది పీఠాధిపతులు ఆరోపించారు. వీరంతా శ్రీవారి దర్శనార్థం తిరుమల వచ్చారు. మహద్వారం నుంచి దర్శనానికి పంపమని కోరగా.. తమకు ఎలాంటి సమాచారం లేదని భద్రతా సిబ్బంది తెలిపారు. ముందుగా లేఖ ద్వారా తెలియజేసినా ఇలా చేస్తారా అంటూ వారు అక్కడే కాసేపు నిరసన తెలిపారు. అనంతరం శ్రీనివాస మంగాపురంలో విలేకరులతో మాట్లాడారు. విజయవాడకు చెందిన శ్రీయోగి పీఠం అధిపతి శ్రీయోగి అతిథేశ్వరానంద పర్వత స్వామి మాట్లాడుతూ.. తిరుమలలో రాజకీయ నేతలు, ధనవంతులకు మాత్రమే స్వేచ్ఛగా దర్శన భాగ్యం కలుగుతోందని ధ్వజమెత్తారు. అలాగైతే అఖిల భారత హిందూ మహాసభ ద్వారా తమ భక్తులను రాజకీయాల్లోకి దింపుతామని స్పష్టం చేశారు. తిరుమలలో మార్పులు జరగకపోతే దేశవ్యాప్తంగా ఉన్న 900 మంది పీఠాధిపతుల ఆశీర్వాదంతో త్వరలో ఏపీలో కొత్త పార్టీని స్థాపిస్తామన్నారు. తిరుమలలో సామాన్య భక్తులు స్వేచ్ఛగా వెళ్లి స్వామిని దర్శించుకునే పరిస్థితులు లేవని స్పష్టం చేశారు. త్వరలోనే తిరుపతిలో బహిరంగ సభ పెట్టి తితిదేలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను వెల్లడిస్తామని తెలిపారు.

## ఇళ్ల నిర్మాణం అనుకున్న సమయానికల్లా పూర్తి కావాలి: సీఎం



**అమరావతి:** గృహనిర్మాణ శాఖపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం సమీక్షా సమావేశం చేపట్టారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో జగనన్న కాలనీలు, టిడ్కో హౌసింగ్ పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ఇళ్లులేని వారందరికీ ఇళ్లు ఇవ్వడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ రూ. 5,655 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణంపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. లే అవుట్లలో పర్యటన వల్ల ఇళ్ల నిర్మాణ ప్రగతిపై సమీక్షించి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. లే అవుట్లను సందర్శించినట్టుగా ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ప్రతి శనివారం హౌసింగ్‌డేగా నిర్వహిస్తున్నామని.. ఆ రోజు తప్పనిసరిగా అధికారులు లే అవుట్లను సందర్శిస్తున్నారని అధికారులు సీఎంకు వెల్లడించారు.

ఇళ్ల నిర్మాణం అనుకున్న సమయానికల్లా పూర్తి కావాలి. ఆప్షన్-3 ని ఎంపిక చేసుకున్న లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణంపై దృష్టిపెట్టాలి. లే అవుట్ల వారీగా ప్రాధాన్యత పరంగా పనులను గుర్తించి.. అనుకున్న సమయానికి ఆ పని పూర్తయ్యేలా చూడాలి. దీనివల్ల ఇళ్ల నిర్మాణంలో చెప్పుకోదగ్గ ప్రగతి కనిపిస్తుంది. ఇళ్ల నిర్మాణం నాణ్యతలో ఎలాంటి రాజీ వద్దు. ప్రతి దశలోనూ నాణ్యతా నిర్ధారణ పరీక్షలు జరగాలి. ఇళ్ల నిర్మాణంలో క్వాలిటీని నిరంతరం పాటించడానికి ఎస్‌ఓపీలను అందుబాటులో ఉంచాలి. గ్రామ సచివాలయాల్లో ఉన్న

(మిగతా 2లో)

## విశాఖ దేశంలోనే పెద్ద ఐటీ హబ్: కేంద్రమంత్రికి బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** బీజేజీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు గురువారం కేంద్ర ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఏపీలోని విశాఖపట్నం నగరాన్ని దేశంలోని పెద్ద ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రికి వినతి పత్రం అందించారు జీవీఎల్.

విశాఖను ఐటీలో మేటిగా తీర్చిదిద్దండి విశాఖపట్నంలో ఐటీ రంగం వేగంగా అభివృద్ధి చెందడానికి అవసరమైన వ్యవస్థను, అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించే వివిధ ఐటీ ప్రాజెక్టుల అనుమతులు, అమలు మంజూరు చేయడం, వేగంగా ట్రాక్ చేయడంలో కేంద్ర ప్రభుత్వం నుంచి మద్దతు, సహకారాన్ని అందించాలని జీవీఎల్ కోరారు. స్టార్టప్ కోసం అవసరమైన వ్యవస్థను మెరుగుపర్చేందుకు ఇంక్యుబేషన్ సేవలను అందించడానికి అత్యాధునిక మౌలిక సదుపాయాలతో విశాఖపట్నం సెంటర్‌లోని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా(ఎస్‌టీపీఐ) కార్యకలాపాలను విస్తరించాలని కేంద్రమంత్రికి విన్నవించారు.

ఐటీ అభివృద్ధి కేంద్రాలు విశాఖలో పెట్టాలంటూ జీవీఎల్ సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్

(మిగతా 2లో)

## దరఖాస్తులకు గడువులోగా సమాధానం



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** సమాచార హక్కు చట్టం లో వచ్చిన దరఖాస్తులకు 30 రోజులలోగా తప్పక సమాధానమివ్వాలని సమాచార హక్కు కమిషనర్ యు. హరి ప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. లేనట్లయితే అడిగిన సమాచారం ఉచితంగా ఇవ్వాలన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యాలయంలో ఉన్న పౌర సమాచార అధికారి, సహాయ అధికారి, అప్పిలేట్ అధికారులు చట్టం పట్ల పూర్తి అవగాహన కలిగించుకోవాలన్నారు. ఉద్యోగులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం తగిన కారణం లేకుండా అందించరాదన్నారు. ప్రతి కార్యాలయంలో రికార్డులు రిజిస్టర్లు దస్త్రాలు కేటగిరీల వారీగా విభజించి విషయ సూచిక రూపొందించుకోవాలన్నారు. దీనివలన సమయం వృధా కాదన్నారు. దరఖాస్తు తీసుకున్న వారికి తప్పక రసీదు ఇవ్వాలని, ఇచ్చిన సమాచారానికి రసీదు పొందాలన్నారు. 16 కోలమ్ లతో నంబర్ 1 రిజిస్టరు, 8 కోలమ్ లతో నెంబర్ 2 రిజిస్టరు ఉండాలన్నారు. వాటిలో దరఖాస్తు తీసుకున్న, జవాబిచ్చిన, సమాచారం ఇచ్చిన తేదీలను, వసూలు చేసిన రుసుము వివరాలను, సమాధానం పాక్షికమా పూర్తిగా ఇచ్చేరన్నది నమోదు చేస్తూ ఉండాలన్నారు. వీలైనంతవరకు పిఐఓ స్థాయిలోనే దరఖాస్తు పరిష్కరించాలన్నారు. దరఖాస్తు తిరస్కరించిన కారణాన్ని కూడా తెలపాలన్నారు. రెవెన్యూ, న్యాయస్థానాలకు సంబంధించిన విషయాలలో విచారణ జరిపి పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు 4(1)(ఏ)(బి)రిజిస్టర్లు ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలన్నారు.

దరఖాస్తుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారిని శత్రువులుగా చూడరాదని దరఖాస్తుదారుని సమాచారం గోప్యంగా ఉంచాలన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు, ప్రభుత్వ సేవలు అందరికీ అందేలా స.హ. కార్యకర్తలు కృషి చేస్తున్నారని ఆయన అభినందించారు. అదేవిధంగా కొంతమంది బెదిరింపులకు (బ్లాక్ మెయిల్) పాల్పడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సమాచార హక్కు ద్వారా సాధించిన విజయాలను గురించి ఆయన తెలియజేస్తూ ఢిల్లీలో వీధి దీపాలు, రేషన్ సరఫరా సమస్యలు పరిష్కారమైనట్లు తెలిపారు. అనకాపల్లి జిల్లాలో దేవరపల్లి, పరవాడ సబ్బవరం మాడుగుల మండలాల నుండి కమిషనరేట్ కు దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం లో ఆర్టిఐ అమలును, రిజిస్టర్లను తనిఖీ చేశారు. సర్వే, మత్స్యశాఖ, పంచాయతీ రాజ్ కార్యాలయాల్లో రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల పట్ల స.హ. అమలుపట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. తర్వాత అనకాపల్లిలోని ఆర్డిఓ, తాసిల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు జీవీఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయం, దిశ పోలీస్ స్టేషన్ లలో ఆర్టిఐ అమలును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ, అదనపు ఎస్పీ పి.విజయ భాస్కర్, ఆర్డీవోలు చిన్ని కృష్ణ, జయరామ్, ఏవో శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఏయూలో మూడు చెయిర్ ప్రొఫెసర్‌ల ఏర్పాటు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒకేరోజు మూడు చెయిర్ ప్రొఫెసర్‌లు ఏర్పాటు అయ్యాయి. ఉదయం సింబయాసిస్ టెక్నాలజీస్ సంస్థ మేనేజింగ్ పార్టనర్ ఓ.నరేష్ కుమార్ ఏయూ లో 'సింబయాసిస్ టెక్నాలజీస్' పేరుతో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి సంబంధించిన అధికారిక లేఖను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సమక్షంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణ మోహన్‌కు అందజేశారు.

మాప్ అవెన్యూస్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఏ. మన్మోహన్ (రామకృష్ణ) ఏయూలో 'షేక్ సైదూన్ మసూమ బేగం' పేరుతో చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదన చేస్తూ లేఖను రిజిస్ట్రార్‌కు అందజేశారు. ఏయూ పూర్వ విద్యార్థిగా ఏయూకు సేవ చేసే అవకాశం కల్పించడం పట్ల వీరు ఆనందం వ్యక్తం చేశారు.

ఫార్మ లిమిటెడ్ డైరెక్టర్ ఏ.లీల రాణి ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డితో సమావేశమయ్యారు. ఏయూతో తమ సంస్థ తరపున చెయిర్ ప్రొఫెసర్ ఏర్పాటు చేయడానికి అంగీకారం తెలిపారు. కార్యక్రమంలో ఏయూ అకడమిక్ సెనేట్ సభ్యులు కుమార్ రాజ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రవిశ్వవిద్యాలయంలో విభిన్న సంస్థలు చెయిర్ ప్రొఫెసర్‌లు ఏర్పాటు చేయడం, పరిశ్రమలతో విశ్వవిద్యాలయం అనుబంధం బలోపేతం అవుతోందన్నారు.

(మిగతా 2లో)

## (మొదటి పేజీ తరువాయిలు)

**కర్మయోగి ప్రారంభ షెడ్యూల్‌ను ప్రారంభించిన మోది**

ప్రధాన మంత్రి వెల్లడిస్తూ, 2047వ సంవత్సరం లో ఒక న్యూ ఇండియా ను సాకారం చేయాలి అనే లక్ష్యాన్ని ప్రస్తావించారు. "మీ ఎదుట గోవా అభివృద్ధి తో పాటే 2047వ సంవత్సరపు న్యూ ఇండియా ను సాకారం చేయాలనే లక్ష్యం సైతం ఉంది. మీరంతా పూర్తి సమర్పణ భావం తో, పూర్తి సన్నద్ధత తో మీ కర్తవ్య పథాన్ని తప్పక అనుసరిస్తారన్న నమ్మకం నాలో ఉంది" అంటూ ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

**ఇళ్ల నిర్మాణం అనుకున్న సమయానికల్లా పూర్తి కావాలి: సీఎం**

ఇంజినీరింగ్ అసిస్టెంట్ సేవలను విస్తృతంగా వాడుకోవాలి. ఇళ్ల నిర్మాణంలో క్వాలిటీ ప్రమాణాలు పాటించే విషయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ భాగస్వామ్యం తీసుకోవాలి.

ఇళ్లు పూర్తయ్యే సరికి మూడు రకాల మౌలిక సదుపాయాలు ఉండాలి. విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలి. మిగిలిన మౌలిక సదుపాయాలనూ వృద్ధిచేసుకుంటూ ముందుకు సాగాలి. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధం అయ్యాయని అధికారులు తెలిపారు. ప్రాధాన్యతాక్రమంలో చేసుకుంటూ వెళ్తున్నామన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో గృహనిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, సీఎస్ సమీర్ శర్మ, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దవులూరి దొరబాబు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, గృహనిర్మాణశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, ఇంధనశాఖ స్పెషల్ సీఎస్ కె విజయానంద్, ఏపీ టిడ్కో ఎండీ సీహెచ్ శ్రీధర్, ఆర్థికశాఖ కార్యదర్శి కె వి వి సత్యనారాయణ, ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి ఇంతియాజ్, గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి రాహుల్ పాండే ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**విశాఖ దేశంలోనే పెద్ద ఐటీ హబ్: కేంద్రమంత్రికి బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు**

ఫ్యాబ్రికేషన్‌ను ఉపయోగించి విద్యను, కనిపెట్టడానికి సాధనాలు, జ్ఞానం, ఆర్థిక మార్గాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విశాఖపట్నంలో ఫ్యాబ్రికేషన్ లేబొరేటరీ(ఫ్యాబ్లాబ్) ఏర్పాటు చేయాలని బీజేపీ ఎంపీ జీవీఎల్ విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్(సీడీఏసీ) కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని జీవీఎల్ కేంద్రమంత్రిని కోరారు.

విశాఖతోపాటే ఏపీ నగరాలకు ఐటీలో రాణిస్తాయన్న జీవీఎల్ విశాఖపట్నం తోపాటు ఏపీలోని ఇతర జిల్లాలు, నాన్ మెట్రోపాలిటన్ నగరాల్లోనూ యువతకు ఉపాధి అవకాశాలను సృష్టించేందుకు బీపీఓ ప్రోత్సాహక పథకాన్ని కొనసాగించాలని జీవీఎల్ కోరారు. మరోవైపు, దేశంలో డిజిటల్ విప్లవానికి నాంది పలికినందుకు కేంద్రమంత్రి, ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు జీవీఎల్. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని, ముఖ్యంగా విశాఖపట్నంను దేశంలోనే ప్రధాన ఐటీ అభివృద్ధి కేంద్రంగా పరిగణించి మద్దతునివ్వాలని విన్నవించారు. ఐటీ రంగంలో అభివృద్ధిని సాధించేందుకు ఏపీ, విశాఖకు పుష్కలంగా ఉన్నాయని జీవీఎల్ నర్సింహారావు వివరించారు.

**ఏయూలో మూడు చెయిర్ ప్రొఫెసర్‌ల ఏర్పాటు**

పరిశ్రమల అవసరాలను గుర్తిస్తూ, తదనుగుణంగా పరిశోధనలు జరపడానికి ఇవి ఎంతగానో దోహదకారిగా నిలుస్తున్నాయన్నారు.

## కోర్టులో చోరీపై సీబీఐ దర్యాప్తును స్వాగతిస్తున్నాం: ఏపీ మంత్రి కాకాణి

నెల్లూరు కోర్టులో చోరీ ఘటనపై కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు నెల్లూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.నెల్లూరు: నెల్లూరు కోర్టులో చోరీ ఘటనపై కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. గురువారం నెల్లూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నీతి, నిజాయితీ ఉంది కాబట్టే సీబీఐ విచారణకు అభ్యంతరం లేదని తెలిపామన్నారు. సీబీఐ విచారణతో వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, విమర్శించే తెదేపా నేతల నోర్లు మూతపడతాయన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవాళ్లు సత్యంగా ఉండాలి, అందుకే సీబీఐ విచారణకు అభ్యంతరం తెలపలేదన్నారు. చంద్రబాబు మాదిరిగా భయపడి పారిపోమని, ఏ తప్పు చేయలేదు కాబట్టే ధైర్యంగా హైకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నిందితుడిగా ఉన్న కేసు ఆధారాలు నెల్లూరు నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో చోరీకి గురైన విషయం తెలిసిందే.

ఈ చోరీ ఘటనపై కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తూ హైకోర్టు ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు కోర్టులో చోరీ జరిగిన కేసులో వాస్తవాలు బయటకు రావాలంటే స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హైకోర్టుకు ఇచ్చిన నివేదికలో కోరారు. దీనిపై ప్రభుత్వ తరపు న్యాయవాదిని ప్రశ్నించగా.. సీబీఐ విచారణకు ఆదేశిస్తే రాష్ట్ర ప్రభుత్వానికి అభ్యంతరం లేదని తెలిపారు. హైకోర్టు ఆదేశాలతో ఇదే విషయాన్ని అఫిడవిట్ రూపంలో ఇవ్వటంతో తీర్పును రిజర్వు చేసి.. ఇవాళ ధర్మాసనం తీర్పు వెల్లడించింది.

# సిబ్బందికి ఎయిరిండియా కొత్త రూల్స్



టాటా యాజమాన్యంలో ఎయిరిండియా కొత్త రూపు సంతరించుకుంటోంది. ముఖ్యంగా విమానాల్లో పనిచేసే క్యాబిన్ క్రూ, సిబ్బంది అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ఉండేలా వారి ఆహార్యంలో మార్పులు తీసుకొస్తోంది. ఈ క్రమంలోనే పురుషులు, మహిళా సిబ్బంది వస్త్రధారణకు కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. జుట్టు నెరిసిన వారు రంగు వేసుకోవాలని, అమ్మాయిలైతే మేకప్ కచ్చితంగా వేసుకోవాలని సూచించింది. ఈ మేరకు హెయిర్‌స్టైల్, ఆభరణాలు, యూనిఫామ్‌కు సంబంధించి 40 పేజీల సర్క్యులర్ జారీ చేసింది. సిబ్బంది ఈ కొత్త నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, వీటిని నిర్లక్ష్యం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

**పురుష సిబ్బందికి నిబంధనలు ఇలా..**

.. బట్టతల లేదా జుట్టు ఎక్కువగా ఊడిపోయి నుదురు ఎక్కువగా కన్పించేవారు పూర్తిగా గుండు చేయించుకోవాలి. దాన్ని కూడా ప్రతి రోజూ షేవ్ చేసుకుంటూ ఉండాలి.

..నెరిసిన జుట్టును అనుమతించబోం. తెల్లవెంట్రుకలు ఉన్నవారు క్రమం తప్పకుండా సహజ షేడ్‌లో జుట్టుకు రంగు వేసుకోవాలి. ఫ్యాషన్ రంగులు, హెన్నా వంటివి వేసుకోకూడదు.

జుట్టును ఎప్పుడూ చిన్నగా కటింగ్ చేయించుకుని హెయిర్ జెల్ తప్పనిసరిగా రాసుకోవాలి. పక్క పాపిటితో నున్నగా దువ్వుకోవాలి.

.. చేతికి ఒకే ఒక్క ఉంగరం.. అది కూడా పెళ్లికి సంబంధించినది అయితేనే అనుమతిస్తాం. బ్రాస్‌లైట్‌లు వేసుకోకూడదు.

.. సిక్కు ఉద్యోగులు చేతికి కడియం ధరించొచ్చు. అయితే అది బంగారం లేదా వెండితో ఎలాంటి డిజైన్లు, లోగోలు, రంగు రాళ్లు లేకుండా 0.5సెంటీమీటర్ల మందంతో మాత్రమే ఉండాలి.

.. విమానంలో ఉన్నంత సేపు అన్ని క్యాబిన్ల సిబ్బంది నల్లరంగు జాకెట్లు ధరించాల్సిందే. ఎలాంటి లోగోలు లేని నలుపు సాక్సులు మాత్రమే వేసుకోవాలి.

**మహిళా సిబ్బంది పాటించాల్సిన నిబంధనలివే..**

.. చీరలు లేదా ఇండో వెస్టర్న్ యూనిఫామ్.. ఏది ధరించినా స్కిన్ కలర్‌లో ఉండే సాక్సులు ధరించాలి. చలికాలంలో కంపెనీ ఇచ్చిన స్వెటర్లు మాత్రమే ధరించాలి.

.. శరీర ఛాయకు సరిపోయే ఫౌండేషన్, కన్సీలర్లు తప్పనిసరిగా వేసుకోవాలి. కొత్త నిబంధనల ప్రకారం.. కంపెనీ షేడ్ కార్డ్ ఇచ్చే మేకప్ వేసుకోవాల్సిందే. ఐషాడో, లిప్‌స్టిక్, గోళ్ల రంగు, హెయిర్ షేడ్ కార్డ్స్ యూనిఫామ్ ప్రకారం అనుసరించాలి. నచ్చిన షేడ్స్ వేసుకోడానికి వీల్లేదు.

..చెవులకు బంగారం, లేదా వజ్రాలతో ఉండే గుండ్రటి పోగులు (స్టడ్స్) మాత్రమే ధరించాలి. వాటిపై ఎలాంటి డిజైన్ ఉండకూడదు. ముత్యాల పోగులు ధరించడానికి అనుమతి లేదు.

.. చీర కట్టుకునేవాళ్లు మాత్రమే నుదుటిన చిన్న బొట్టు పెట్టుకోవాలి. అది కూడా ఐచ్ఛికమే.

.. రెండు ఉంగరాలు పెట్టుకోవచ్చు. కానీ ఒక్కో చేతికి ఒక్కోటి మాత్రమే ధరించాలి. చేతికి ఒకే ఒక్క సన్నని గాజు వేసుకోవాలి.

.. అమ్మాయిలు కూడా జుట్టు నెరిసిపోతే సహజ షేడ్స్ లేదా కంపెనీ హెయిర్ కలర్ షేడ్ కార్డ్‌లో ఉండే రంగు వేసుకోవాలి.

.. కంపెనీ మార్గదర్శకాల ప్రకారమే జడ వేసుకోవాలి. మరీ పైకి గానీ.. మరీ కిందకు గానీ కొప్పులు వేసుకోకూడదు. హెయిర్ బన్‌ను తల వెనుకవైపు మధ్యలో వేసుకోవాలి. దానిపై సన్నని నెట్ వేసుకోవాలి. జుట్టుకు కేవలం నాలుగే టిక్‌టాక్ పిన్స్ పెట్టుకోవాలి. చిన్న జుట్టు ఉన్న వారు పర్మనెంట్ స్ట్రెయిట్‌నింగ్ చేయించుకుని నీట్‌గా దువ్వుకోవాలి.

# రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణపై ప్రత్యేక కథనం

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** చెమట చిందించి పంట పండించిన అన్నదాతకు పూర్తి మద్దతు ధర అందించేందుకు వీలుగా మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బీకే) ద్వారా ధాన్యం కొనుగోలు చేసే ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్-2021 సీజన్ నుంచి శ్రీకారం చుట్టి, విజయవంతంగా అమలుచేస్తోంది. ఇప్పుడు కాకినాడ జిల్లాలో ఖరీఫ్ (2022-23) సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ-క్రాప్ బుకింగ్, ఫీల్డ్ వెరిఫికేషన్, ఈ-కేవైసీ ఆధారిత సమాచారంతో 263 ఆర్‌బీకేలతో 117 వరకు మిల్లులను అనుసంధానించి.. ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు, ఆర్‌బీకే సిబ్బంది కృషిచేస్తున్నారు. గ్రామస్థాయిలో నిబద్ధతతో పనిచేస్తున్న వాలంటీర్లు సైతం ఈ బృహత్తర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.

ఈ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు ముందుగానే జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ.. ధాన్యం సేకరణపై రైస్ మిల్లర్ల అసోసియేషన్ల ప్రతినిధులు, పౌర సరఫరాల కార్పొరేషన్, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, ఎఫ్‌సీఐ, తూనికలు-కొలతలు, రవాణా, కార్మిక తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు.

మిల్లులను ఆర్‌బీకేలతో అనుసంధానించే ప్రక్రియతో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. నాణ్యతా ప్రమాణాలు, మద్దతుధరలు తదితరాలపై అవగాహన పెంపొందించేందుకు రూపొందించిన ప్రచార సామగ్రిని ఆర్‌బీకేల స్థాయిలో అందుబాటులో ఉంచారు. ఈ ప్రక్రియ సజావుగా సాగేందుకు మండలాలకు ప్రత్యేకంగా అధికారులను కూడా నియమించారు. క్వింటాకు రూ. 25 చొప్పున హమాలీ ఛార్జీలను, దూరం ఆధారంగా ధాన్యం రవాణా ఛార్జీలను రైతులకు అదనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. అదే విధంగా 75 కిలోల గోనె సంచులకు రూ. 6.33 చొప్పున యూజర్ ఛార్జీలను చెల్లిస్తున్నారు. ధాన్యం రవాణాకు ఎద్దుల బళ్లను ఉపయోగించుకున్నా సరే ఈ ఛార్జీలను చెల్లిస్తున్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులకు ఏవైనా సందేహాలున్నా, సహాయం కావాలన్నా లేదా ఫిర్యాదు చేసేందుకు 8886613611 నంబరును అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు 4,828 మంది రైతుల నుంచి రూ. 52.19 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించగా.. ఇప్పటికే 2,736 మంది రైతులకు రూ. 16.42 కోట్లు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేసింది.

ఈ నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రస్తుతం ధాన్యం సేకరణపై రైతుల మనోగతం వారి మాటల్లోనే..

1. గతంలో ఎప్పుడూ ఇంత తొందరగా డబ్బులు పడలేదు

- పుణ్యమంతుల వెంకట రమణ, వేములవాడ గ్రామం, కరప మండలం.

మేము దాదాపు 30 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నాం. ధాన్యం అమ్మిన తర్వాత సొమ్ము మూడు రోజుల్లోనే నేరుగా మా ఖాతాల్లో జమ కావడం ఎప్పుడూ చూడలేదు. 21 రోజుల్లో ధాన్యం డబ్బులు మా ఖాతాలో పడతాయని చెప్పారు. అయితే కేవలం మూడు రోజుల్లోనే డబ్బు చేతికందడంతో చాలా ఆనందంగా ఉంది. ఈ సొమ్ము మా వ్యక్తిగత అవసరాలకు ఎంతో ఉపయోగపడుతోంది. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు విధానం ఎప్పుడూ ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా. మా క్షేమం కోసం ఇలాంటి విధానాన్ని ప్రవేశపెట్టిన గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

2. ఆర్‌బీకే సిబ్బంది వెన్నంటి ఉన్నారు

- దాసరి సూర్యనారాయణ, కరప మండలం, కరప గ్రామం.

మాకు ఆరెకరాల పొలం ఉంది. ఇటీవల పంటను మిషన్‌తో కోయించాం. ధాన్యాన్ని శుభ్రంగా ఆరబెట్టుకున్నాం. రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సహాయంతో ధాన్యాన్ని విక్రయించాం. 75 కిలోల బస్తాకు రూ. 1,530 మద్దతు ధర లభించింది. మాకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రైతు భరోసా కేంద్రాల సిబ్బంది మాకు వెన్నంటి ఉండి ధాన్యాన్ని సజావుగా విక్రయించేలా చేశారు. తేమ శాతం, మద్దతు ధర ఇలాంటి విషయాలన్నీ మాకు వివరించారు. మా బాగు కోసం ఎంతగానో తపిస్తున్న గౌరవ ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు.

3. ధాన్యం సేకరణకు మంచి ఏర్పాట్లు చేశారు

- కొండపల్లి సత్యప్రసాద్, వేట్లపాలెం, సామర్లకోట మండలం.

కోత కోసిన అనంతరం మా ధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ ఆర్‌బీకే సిబ్బందిని అడిగాను. వెంటనే ఆరబెట్టిన మా ధాన్యం శాంపిళ్లను సిబ్బంది పరిశీలించారు. తేమ శాతం 14.7గా ఉందని చెప్పారు. హమాలీలు, ట్రాక్టర్‌ను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ నెల 16వ తేదీన ధాన్యం కొనుగోలు పత్రం అందించగా.. 19వ తేదీనే నా ఖాతాలో డబ్బులు పడ్డాయి. ఇంత మంచి కార్యక్రమాన్ని అమలుచేస్తున్నందుకు ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. జిల్లా కలెక్టర్ గారు, జాయింట్ కలెక్టర్ గారు ప్రత్యేకంగా చొరవ చూపుతూ జిల్లాలో ధాన్యం సేకరణకు మంచి ఏర్పాట్లు చేశారు.

4. మాకు అండగా గ్రామ వ్యవసాయ సహాయకులు

- ముత్యాల వెంకట చౌదరి, హుస్సేనుపురం గ్రామం, సామర్లకోట మండలం.

విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటివి అందించడంతో పాటు మేము పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేంత వరకు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది మాకు తోడుగా ఉన్నారు. ధాన్యం కొనుగోలు చేయాలంటూ మేము అడిగిన వెంటనే టెక్నికల్ అసిస్టెంట్ శాంపిల్ తీసి పరీక్షించారు. మా వీఏఏ మాకు అన్ని విధాలా సహకరిస్తున్నారు. ఈ నెల 13న ధాన్యం తీసుకెళ్లగా 18వ తేదీన ధాన్యం సొమ్ము మా ఖాతాలో పడింది. ఇంత మంచి విధానాన్ని అమలుచేస్తున్నందుకు ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు.

# జిల్లాలో ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్ళు

**విజయనగరం:** జిల్లా ధాన్యం కొనుగోలుకు శుభారంభం జరిగింది. గురువారం బాడంగి మండలం రాజేరు లో శాసన సభ్యులు శంబంగి చిన్న వెంకట అప్పల నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలి రోజే 3 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు పౌర సరఫరాల జిల్లా మనేజర్ మీనా కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ ఈ నెల 25 లోగా మండల స్థాయి అవగాహనా సమావేశాలు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసారు. వారి ఆదేశాల మేరకు మండల స్థాయి లో వి.ఏ.ఓ లు, టెక్నికల్ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులు, తహశీల్దార్లు సమావేశాలు నిర్వహించి ధాన్యం సేకరణ సన్నదత పై సమీక్షలు జరిపారని ఆమె తెలిపారు.

అదే విధంగా ఆర్.బి.కె స్థాయి లో రైతులకు కూడా అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందని మీనా కుమారి తెలిపారు. ఇప్పటికే మిల్లర్ల నుండి గోనె సంచులను సేకరించడం జరిగిందని, బాంక్ గ్యారంటీ లను వేగవంతం చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ ద్వారా కోతలు పూర్తి చేసిన వారి వివరాలను, నూర్పు చేసిన వారి వివరాలను సేకరిస్తూ వారి వద్దకు కొనుగోళ్ళకు వెళ్లడం జరుగుతోందన్నారు. శాంపిల్స్ ను తీసుకొని తేమ శాతాన్ని పరిశీలించడం జరుగుతోందన్నారు. ధాన్యం కొనుగోళ్ళకు జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధం గా ఉన్నట్లు ఆమె తెలిపారు.

### పంచాంగం

శుక్రవారం 25-11-2022
శుభకృత్ నామ సంవత్సరము
దక్షిణాయణం హేమంత రుతువు
మార్గశిర మాసం

తిథి : బ. విదియ రా. 10.34
నక్షత్రం : జ్యేష్ఠ సా. 05.19
వర్జ్యం : రా. 12.32 ల 01.58




సమస్యలతో సతమతమవడం కంటే సాధకుల సహాయం కోరుట మేలు.

బ్రహ్మశ్రీ హనుమద్దాస్ స్వామీజీ గారు ప్రస్తుతం చెన్నైలో ఉన్నారు.

సెల్ : 9440537607


# ఐసీడీఎస్‌లో మోసం



పురుగుల చిక్కీ.. బూజుపట్టిన కర్జూరం: పాత నిల్వలకు కొత్త లేబుళ్లు

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో గర్భిణులు, బాలింతలకు అందించే అదనపు పౌష్టికాహారాన్ని అక్రమార్కులు వదలడం లేదు.

జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో గర్భిణులు, బాలింతలకు అందించే అదనపు పౌష్టికాహారాన్ని అక్రమార్కులు వదలడం లేదు. సంపూర్ణ పోషణ పథకం కింద పంపిణీ చేస్తున్న 'వైఎస్ఆర్ కిట్ల' రూపంలో ప్రతి నెలా రూ.లక్షలు దోపిడీ చేస్తున్నారు. కొందరు సీడీపీఓలు, పర్యవేక్షకులు గుత్తేదారులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారు. పాత సరకు (నిల్వలు)కు కొత్త లేబుళ్లు (స్టికర్లు) వేసి నయా దందాకు తెర లేపారు. తాజాగా అనంత నగరం రాణినగర్‌లో ఓ అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేసిన వేరుసెనగ చిక్కీలో పురుగులు బయటపడ్డాయి. మరోచోట ముద్దలా మారిన అటుకుల ప్యాకెట్ బయటకు తీశారు. రాగిపిండిలో ఇసుక, బూజుపట్టిన ఖర్జూరం.. వంటివి వైఎస్ఆర్ కిట్‌లో వెలుగు చూశాయి. ఉమ్మడి జిల్లాలో నాణ్యతలేని సరకులు పంపిణీ చేస్తున్నారు. జిల్లా యంత్రాంగం ఉదాశీనంగా వ్యవహరించడంపై విమర్శలకు దారి తీస్తోంది.

**ఏమేమి ఇవ్వాలంటే..**

కిట్‌లో ఆరు రకాల సరకులు ఉంటాయి. రాగిపిండి, జొన్నపిండి, అటుకులు కిలో చొప్పున, బెల్లం, చిక్కీ, ఖర్జూరం 250 గ్రాముల ప్రకారం ఇస్తున్నారు. రావులపాలెం, విశాఖ, నెల్లూరుకు చెందిన గుత్తేదారులు టెండర్లు దక్కించుకున్నారు.

**బూజుపట్టిన కర్జూరం**

**తయారీ తేదీపై సందేహాలు**

మొదట్నుంచి కిట్ల తయారీ, ఎమ్మార్పీ, గడువు వంటి వివరాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పాత నిల్వలకే కొత్త ప్యాకెట్లను తయారు చేసి.. ఎమ్మార్పీ వివరాలను కూడా కొత్తగా ముద్రిస్తున్నట్లు సమాచారం. అనంత నగరంలో ఈ తరహాలో 136 ప్యాకెట్లు బయటకు పడినట్లు తెలిసింది. సదరు గుత్తేదారుడికి షోకాజ్ నోటీసు కూడా జారీ చేశారు. అయినా మార్పు రాలేదు. నాణ్యత, తూకాలపై నిరంతరం ఆహార కల్తీ నిరోధక శాఖ, తూనిక, కొలతల శాఖ పరిశీలన చేయాలి. అవసరమైతే ల్యాబొరేటరీలకు పంపాలి. ఏడాది కాలంలో ఒక్క రోజు కూడా తనిఖీలు జరిగిన దాఖలాలు లేవు. పేదలకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 ప్రాజెక్టుల పరిధిలో 5,126 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో గర్భిణులు 27,778 మంది, బాలింతలు 25,504 మంది చొప్పున మొత్తం 53,282 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరందరికీ వైఎస్ఆర్ కిట్లు ఇస్తున్నట్లు 'లెక్క' రాస్తున్నారు. ఒక్కో కిట్‌లో ఆరు రకాల సరకులు ఉంటాయి. ఒక్కో కిట్ ధర రూ.222. ఈ లెక్కన నెలకు రూ.1,18,28,604 ఖర్చు చేస్తున్నట్టే. 2021 సెప్టెంబరు నుంచి నలుగురు గుత్తేదారులు ఆయా కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు.

**నాణ్యమైనవే సరఫరా చేస్తాం**

కొన్ని ప్రాంతాల్లో నాసిరకం సరకులు ఇచ్చినట్లు ఫిర్యాదులు వచ్చాయి. గతంలో గుత్తేదారులకు నోటీసులు జారీ చేశాం. తాజాగా నాసిరకం సరకులు ఇచ్చినట్లు తేలితే బిల్లుల్లో కోత పెడతాం. ఇప్పటికే చాలాసార్లు గుత్తేదారులను హెచ్చరించాం. పాత నిల్వలపై కొత్త లేబుళ్లు వేస్తున్నారన్న దానిపై ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై విచారణ చేయిస్తున్నాం.

**ఉమ్మడి జిల్లా లెక్క:** అంగన్‌వాడీలు: 5,126, గర్భిణులు: 27,778, బాలింతలు: 25,504, వైఎస్ఆర్ కిట్ ధర: రూ.222, నెలకు రూ.1.18 కోట్లు ఖర్చు.

విశాఖ సమాచారమ్

శుక్రవారం 25-11-2022

## ఇంటిపేర్లు

అరవై దాటేలోపు ఆరుసార్లు అమెరికాకైతే వెళ్ళగలిగాను కానీ ఫ్లైట్లో ఇచ్చిన చిన్నఫారమే సరిగ్గా నింపలేకపోయాను. ఆ ఫారమ్‌లో నేమ్ అన్న దగ్గర ఫస్ట్‌నేమ్, మిడిల్‌నేమ్, లాస్ట్‌నేమ్ అని మూడుగళ్ళున్నాయి. మనకు తెలిసిందల్లా మనపేరు, దాని వెనకాముందు ఓ ఇంటిపేరు. ఆది మధ్యాంతరాలు ఏవో తెలియక ఎలాగోలా ఆ గళ్ళు నింపి బయటపడ్డా.

ఇంటిపేర్లు తెచ్చిన తంటా ఎలాంటిదంటే ఒకసారి భయస్తుడైన ఉద్యోగి సర్ నేమ్ అన్నకాలమ్ ఎదుట స్వామిభక్తితో వాళ్ళ బాస్ పేరు రాస్తే, అతి భయస్తుడైన భర్త ఎందుకొచ్చిన గొడవని సర్‌నేమ్ అన్న కాలమే కొట్టేసి మేడమ్ నేమ్ అని రాసేసుకుని దాని ఎదురుగా వాళ్ళావిడ పేరు రాసేసి గొప్ప రిలీఫ్‌గా ఫీలయ్యాడట.

ఏది ఏమైనా మన వెంటే ఉండే ఇంటిపేర్లు పంచ భూతాలతో మొదలై కనపడిన దేన్నీ వదల్లా. కాదేదీ కవితకనర్హం అన్నట్లుగానే కాదేదీ ఇంటిపేరుకనర్హం. గాలి, ఆకాశం, సముద్రం, మబ్బులతో పాటుగా రోజూవారీ కాలాలైన మధ్యాహ్నం, పట్టపగలు, చీకటి, సంధ్యావందనాలు కూడా ఇంటిపేర్లయినాయి. అడవి జంతువులైన పులి, ఏనుగు, నక్క, జింక, ఎలుగుబంటిలతో పాటు సాధుజంతువులైన ఆవులు, దూడల, మేకల, పిల్లి, గుర్రం, గేదెల, ఉడుత, ఎనుపోతుల, గొఱ్ఱెల, పెనుపోతుల, బల్లి, పీతల కూడా మరి కొందరి ఇంటి పేర్లయ్యాయి.

గతంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ కులపతిగా మేకా రంగయ్య అప్పారావు గారి తరువాత జస్టిస్ ఆవుల సాంబశివరావు గార్ని నియమిస్తే పత్రికల వాళ్ళు మేకలు పోయి ఆవులొచ్చాయి అని చమత్కరించారు. ఏనుగు లక్ష్మణకవి, కాశీయాత్ర రాసిన ఏనుగుల వీరాస్వామయ్య మనందరికీ పరిచయమే. గుంటూరు ప్రాంతంలో పూర్వం కొందరు ముర్రాజాతి గేదెపాలు అమ్మేవారట. ఆ గేదెకొమ్ములు జంగిలి (అడవి) దున్నల కొమ్ముల్లా ఉండటంతో వూరి వాళ్ళందరూ జంగిలి వాళ్ళింట్లో పాలు కొంటాం అనడంతో వాళ్ళ ఇంటిపేరు జంగిలి అయిపోయిందట.

మనదేశంలో ఇంటిపేర్లు అమెరికా పోయిన మన వాళ్ళకు పేర్లే కావడంతోనే ప్రమాదం. పోయినసారి అమెరికా వెళ్ళినప్పుడు మా బావ ఆనంద్ గారి ఇంట్లో ఫోన్ రింగైతే నేను ఎత్తితే అవతలి నుంచి 'పిల్లి స్పీకింగ్' అనగానే కంగారుపడ్డా. తరువాత మా బావ చెప్తే తెలిసింది వారు పిల్లి సురేష్ గారని. అదే ఏ పులి వెంకటరెడ్డిగారో ఎత్తితే పులి గాండ్రింగ్ అనో, పాముల నర్సయ్యగారో ఎత్తితే పాములు బుస్సింగో అంటారేమో. మిగిలిన వాళ్ళేం తక్కువ. వాళ్ళు దూడల స్పీకింగనో, 'కోడి' కేరింగనో, కాకి 'కావిం'గనో అనేస్తే, అవి విని మనం కెవ్వుకెవ్వు అనాల్సొచ్చేది. అమెరికాలో సైతం వృత్తులను ఆధారంగా చేసుకుని ఇంటిపేర్లు వస్తాయట. కమ్మరి పనిచేసేవాళ్ళు smithలు అయితే వడ్రంగి పనిచేసే కుటుంబాలు woods అవుతారు.

మనవైపు ఊళ్ళపేర్లు ఇంటిపేర్లు కావడం సర్వసాధారణం. శ్రీరంగం, కాళహస్తి, శ్రీశైలం, అన్నవరం, సింహాచలం, వారణాసి, శంకరంబాడి, ద్రాక్షారం, ప్రయాగ, కంచి, మధురాంతకం, తిరువీధుల, రామేశ్వరం, తిరుమల వంటి పుణ్యక్షేత్రాలతో పాటు గుడివాడ, బెజవాడ, గూడూరు, కడప, కావలి, చల్లపల్లి, కొండపల్లి, గుంటూరు, టంగుటూరు, దర్శి, తెనాలి వూళ్ళు ఇంటిపేర్లయ్యాయి. నీళ్ళకు సంబంధించిన చెఱువు, బురదగుంట, కోనేరు, తూము, నూతి, కడలి, రేవు, కలువ కొలను, కాలువ ఇంటిపేర్లయ్యాయి. పక్షులైన డేగలు, కోడి, పిచ్చుకలు, కాకి, పావురాల, నెమలి, కొంగర, చిలక, పిట్టల, గువ్వల ఇంటిపేర్లే. కోడి రామ్మూర్తి గారు గతంలో గొప్ప మల్లయోధులు. ఇలాంటి ఇంటిపేర్లతో ప్రమాదమేమిటంటే డేగలవారింటి అబ్బాయికి పిచ్చుకల వారింటి అమ్మాయిని ఇవ్వడానికి వెనుకాడతారేమో. అసలే మన జాతకాలు (హర్రర్‌స్కోప్) చూసేవాళ్ళు దేవగణం, రాక్షస గణం, మనిషిగణం అని లెక్కలేసి అమ్మాయి పులి అయితే అబ్బాయి పిల్లి అయ్యాడనో భయపడి పులి తినేస్తుందని (కాకపోయినా అదే జరిగేది) పెళ్ళికి వెనకాడతారు. లోహాలైన బంగారు, కంచు, రాగిరెడ్డి, కనకమేడలు, ఆభరణాలైన ఉంగరాలు, వడ్డాణం, సవరం, మెట్ల, కట్టుపోగుల, గాజులు, కడియాలతోపాటు పగడాలు, ముత్యాలు, మాణిక్యాలు, రవ్వలు, వజ్రం కూడా ఇంటిపేర్లయ్యాయి. పనిముట్లైన తాపీ, వడంబం, ఉలి, వానం ఇంటిపేర్లే. తాపీ ధర్మారావు గారు గొప్పరచయిత సినీదర్శకులు.

ఉత్తర భారతదేశంలో ఇంటిపేర్ల కథ వేరే విధంగా ఉంటుంది. అగ్నిహోత్రం చేసే కుటుంబాలు అగ్నిహోత్రులు. వారణాశి ప్రాంతంలో నాలుగు వేదాలు చదివిన పండిత కుటుంబీకులు చతుర్వేదులైతే, మూడువేదాలు చదివినవారు త్రివేదిలు, రెండే చదివితే ద్వివేది. సామవేదం చదివితే సామవేదం వారౌతారు. అదే ఫ్లోలో ఏ వేదమూ చదవని కుటుంబీకుల్ని నిర్వేదులనాలేమో. బెంగాలీలో బంధోపాధ్యాయులు, చటోపాధ్యాయులు, ముకోపాధ్యాయుల్ని ఎక్కువగా చూస్తాం. నా పరిమిత జ్ఞానంతో ముకోపాధ్యాయులు అంటే ముక్కుతో చదివేవారేమో అనుకునేవాడ్ని. వాజపేయుల, సోమయాజుల ఇలాంటివే మరికొన్ని. ఉత్తర భారతదేశంలోని పేర్లమీద మోజుతో ప్రగతిశీలులైన మన తెలుగు సోదరులు కొందరు చాలాకాలం క్రిందటే వాళ్ళ పిల్లలకు టాగూరనో, రాయ్ అనో, ఛటర్జీ అనో, బెనర్జీ అనో, గాంధీ అనో, బోస్ అనో పేర్లు పెట్టేసారు. ఇలా పేర్లు పెట్టడం బాగానే ఉంది కాని నిజానికి అవి వాళ్ళ పేర్లుకావు. హౌస్‌నేమ్స్. ఇది గుర్రాన్ని వదిలి కళ్ళాన్ని పట్టుకున్నట్లే. పేరు ఏదైనేం లెండి అటువంటి పెద్దల పట్ల మనవాళ్ళకు గల భక్తి, గౌరవాలను మనం మెచ్చుకుందాం.

## రైతులను దోపిడి చేసేందుకే భూ హక్కు - భూ రక్షణ పథకం

**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** పట్టాదారు పాస్ పుస్తకాలపై ప్రభుత్వ రాజముద్ర ఉండాలే తప్ప ఈ రాష్ట్రాన్ని పరిపాలించిన ఏ ముఖ్యమంత్రి తమ ఫోటోలు పెట్టుకోలేదని పిచ్చి పరాకాష్టకు చేరిందనీ,ప్రజల భూములు తాలూకా హక్కులపై పెత్తనం చెలాయించడానికి చూస్తున్నాడని ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసన మండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విలేకరుల సమావేశంలో ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. భూదోపిడికి యదేచ్ఛగా కొనసాగించడానికే జగన్ రెడ్డి శాశ్వత భూహక్కు - భూ రక్షణ పథకాన్ని తీసుకొచ్చారని వీటిని చట్టబద్ధం చేసుకునేందుకే కుట్ర పన్నుతున్నారని ప్రైవేటు వ్యక్తుల, ప్రశ్నించిన వారి భూములను నిషేధిత జాబితాలో( 22ఏ ) చేర్చి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని నాగ జగదీష్ అన్నారు. ప్రభుత్వానికి చెందాల్సిన భూములను 22-ఏ జాబితా నుండి తొలగిస్తూ వేలాది కోట్ల లూటీకి జగన్ రెడ్డి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని విశాఖలో 42 నెలల్లో సుమారు 40 వేల కోట్లు విలువైన భూములను జగన్ రెడ్డి విజయ సాయి రెడ్డి వైసీపీ నేతలు దోపిడీదారుల్లా కాజేశారని ఇప్పటికే రైతన్నల పట్టాదార్ పాస్ పుస్తకాలపై పేర్లు, రంగులు మార్చి జగన్ రెడ్డి బొమ్మ ముద్రించుకున్నారని ప్రజల ఆస్తులపై తన బొమ్మ ముద్రించుకోవడానికి జగన్ రెడ్డికి ఉన్న అధికారమేమిటని నాగ జగదీష్ ప్రశ్నించారు.ఈ పథకం కింద భూ రికార్డులుఇష్టం వచ్చినట్లు మార్చడంతో పాటుఎవరి భూములు ఎవరి ఖాతాలోకి వెళ్తాయో అర్థం కాని పరిస్థితిలో రైతులు అయోమయంలో ఉన్నారని అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వంపై రైతులకు అప్పీల్ కి వెళ్ళే అవకాశం ఉంటుందని చెబుతున్నప్పటికీ రిసర్వే సమయంలో వచ్చిన 19 వేల ఫిర్యాదులు ఇంకా పరిష్కారం కాలేదని నాగ జగదీష్ తెలిపారు. పైగా రైతులకు సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారం లేకుండానే హడావిడి గా తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారని ఏ ఒక్క పథకం కూడా ప్రజామోదం పొందలేదని ప్రకటించడం మధ్యలో వదిలేయడమే జరుగుతుందని ఆపీళ్లు పరిష్కారం కాకుండా, భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేందుకు జగన్ రెడ్డి చూపించే తాపత్రయం ప్రజలు ఆస్తులపై హక్కు కోల్పోయేలా చేస్తుందని నాగ జగదీష్ మండిపడ్డారు. తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి మాట్లాడుతూ ఇప్పుడు ఆర్వోఆర్ రూల్స్



మార్చడం వల్ల భూ రికార్డుల సవరణ విషయంలో జగన్ రెడ్డికి విశిష్ట అధికారాలు కల్పించుకున్నారని దీంతో తమకు నచ్చినట్లుగా చివరి నిమిషంలో కూడా భూమి రికార్డును ఖరారు చేసే వెసులుబాటును రెవెన్యూ శాఖ కు కట్టబెడుతూ జీవో 573 జారీ చేయడం దుర్మార్గమైన చర్యని రమణమూర్తి మండిపడ్డారు. జగన్ రెడ్డి చేస్తున్న మార్పులు వైసీపీ భూకబ్జారులకు వరంగా మారుతుందని సర్వే సమయంలో సంబంధిత వ్యక్తులు లేకపోతే ఆ ఆస్తి అన్యాకాంతమైనట్లేనని, విదేశాల్లో ఉన్నవారు, వలస వెళ్లిన వారికి నోటీసులు ఎలా ఇస్తారో అర్థం కాని పరిస్థితి మారిన నిబంధనలతో ఆ భూములను వైసీపీ నేతలు కాజేసేందుకు శాశ్వత భూమి హక్కు భూ రక్షణ పథకం కి జగన్ రెడ్డి మాయలు చేస్తున్నారని రమణమూర్తి వైసీపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. విలేకరుల సమావేశంలో పార్లమెంట్ కార్యదర్శి మల్ల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాహనాల బహిరంగ వేలం పాటకు విశేష స్పందన





**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** ఎ.రవి శంకర్ మంగళగిరి, ఆంధ్రప్రదేశ్ వారి ఉత్తర్వులు మేరకు అనకాపల్లి జిల్లాలో 22 పోలీసు స్టేషన్ ల పరిధిలో నాటు సారా, అక్రమ మద్యం రవాణా కేసులలో పట్టుబడిన 139 వాహనములకు స్థానిక ఎన్.టి.ఆర్ స్టేడియంలో జిల్లా ఎస్పీ గౌతమి శాలి దేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సెబ్, జాయింట్ డైరెక్టర్, బి.విజయ భాస్కర్, సెబ్, అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఏ.రవికుమార్ వారి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటు సారా నిర్మూలన, అక్రమ మద్యం రవాణా అరికట్టేందుకు జిల్లా పోలీసులు కఠిన చర్యలలో భాగంగా బైండోవర్ చేయడం, పి.డి యాక్ట్ కేసుల నమోదు చేస్తున్నామన్నారు. పెద్ద ఎత్తున వేలం పాటదారులు పాల్గొన్న ఈ వేలం లో మొత్తం 139 వాహనాలకు గాను, 135 వాహనాలు వేలం కాగా 4 వాహనాలు(2 ఆటోలు, 2 ద్విచక్ర వాహనాలు మిగిలి పోయినవి.మొత్తం (139) వాహనములకు గాను ఎం.వి.ఐ నిర్ధారించిన అప్ సెట్ విలువ 16,71,600 రూపాయలుకాగా వేలం పాటలో అధికముగ 36,58,500వచ్చినట్లు, దీనిపై జీఎస్టీ 18% .6,58,530 కలిపి మొత్తం.43,17,030 రూపాయలు వచ్చాయని,ఈ మొత్తం సొమ్మును ప్రభుత్వానికి జమ చేస్తున్నట్లు తెలిపారు.

ఈ వాహనాల వేలంపాటను సమర్థవంతంగా నిర్వహించి, వేలంపాట నందు, వాహనాల అప్సెట్ ప్రైస్ కు మించి ఆదాయాన్ని సమకూర్చిన అనకాపల్లి జిల్లా అదనపు ఎస్పి బి.విజయభాస్కర్ , సెబ్ అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ గౌతమి శాలి అభినందించారు.

## వన భోజన కార్యక్రమంలో సిని హీరో కంచర్ల ఉపేంద్ర



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 12 వార్డు లో శ్రీ కృష్ణ యువజన సేవ సంఘం చిన్నగదిలి లో నిర్వహించిన కార్తీకమాస వన భోజన కార్యక్రమంలో ఉపాకర్ గ్రూప్ అధినేత . అచ్యుతరావు కుమారుడు సిని హీరో కంచర్ల ఉపేంద్ర ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.

ఉపేంద్ర బాబు మాట్లాడుతూ కార్తీకమాస వనభోజనాలు చాలా ఉత్సాహంగా బాగా జరుగుతున్నాయి. మాకు తోచినంత ప్రతి కార్యక్రమం కి సహాయ సహకారలు అందిస్తాము అని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిని హీరో కంచర్ల ఉపేంద్ర బాబు, ఉపాకర్ ట్రస్ట్ సభ్యులు. పొట్టి అప్పారావు, సుధీర్. నాగ పాల్గొన్నారు.

## అయ్యప్ప మిత్ర బృందంకు కంచర్ల సాయం



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షి నగర్ శ్రీ భక్తతుకారం ఆలయంలో శ్రీ అయ్యప్ప మిత్ర బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదానం కార్యక్రమంలో భాగంగా ఉపకార్ సేవా సంస్థ ఎస్. ఎస్. ఎల్ క్రియేషన్స్ చైర్మన్ కంచర్ల అచ్యుత్ రావు అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములకు భవానీలకు మండల కాలం అన్నదానంకు 20 బస్తాలు బియ్యం విరాళంగా అందజేశారు. ఈ అన్నదానం కార్యక్రమానికి సినీ హీరో కంచర్ల ఉపేంద్ర హాజరయ్యారు. అయ్యప్ప మిత్ర బృందం గురుస్వాములు ఉపేంద్రకు ఘన స్వాగతం పలికారు. ఆయన చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష ఎంతో పవిత్రమైందని, ఎంతో నియమ నిష్టాలతో కూడిన దీక్ష అయ్యప్ప దీక్షని, దీక్ష చేపట్టి అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ చేయడం అందులో నేను పాల్గొనడం అయ్యప్ప స్వామికి సేవ చేసినట్లేనని ఆయన అన్నారు ఎంతోమంది భక్తులకు ప్రసాదం చేయడం ఎంతో గొప్ప అదృష్టమని అయ్యప్ప మిత్ర బృందం సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## శ్రీ గౌరీ పరమేశ్వరుని దర్శించుకున్న జోనల్ కమిషనర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక అగ్రిమర్రి చెట్టు వద్ద శ్రీ గౌరీ పరమేశ్వరి అమ్మవారిని జి వీఎంసీ జోనల్ కమిషనర్ కే కనకమహాలక్ష్మి , స్థానిక కార్పొరేటర్ పీలా లక్ష్మి సౌజన్య టిపిఆర్ఓ రజనీకుమారి గురువారం దర్శించుకున్నారు. పోలి పాడ్యమి సందర్భంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల కారు బాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నీటి కుండీలో దీపాలు విడిచి పెట్టేందుకు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు సేవా సదన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి ప్రభుత్వ జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి మాట్లాడుతూ ఇటీవల కాలంలో డెంగ్యూ వ్యాధి వలన మరణాల సంఖ్య పెరుగుతుందని దీనిని నివారించడానికి ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రత నీటిలో క్లోరినేషన్ చేసిన మంచినీటినే తీసుకోవాలని అలాగే ఇటువంటి పర్వదినాల్లో కార్తీకదీపం విడిచిపెట్టడానికి నదీ స్థానం కంటే నీటి కుండీలో దీపాలు విడిచిపెట్టడం మంచి ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని కనకమహాలక్ష్మి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ని ఘనంగా సత్కరించారు. ఇటువంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కారు బాబుని జోనల్ కమిషనర్ అభినందించారు.

## 84వ వార్డు సమస్యలపై సమీక్ష నిర్వహించిన జోనల్ కమిషనర్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** జీవీఎంసీ కార్యాలయంలో జోనల్ కమిషనర్, కే. కనకమహాలక్ష్మి గురువారం84 వ వార్డు సమస్యలపై అధికారంతో సమీక్ష సమావేశం 84వ వార్డులో నెలకున్న సమస్యలపైకార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి నీలబాబు చేసిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రఘురాం, కాలనీలో సిమెంట్ రోడ్లు, గొల్ల వీధి సులభ్ కాంప్లెక్స్ రిపేర్లు,కోట్నివీది ప్రాంతంలో ప్రధాన డ్రైనేజీ,,కోట్నివీది లోపల మంచినీటి ట్యాంకు ప్రక్కన కాలువ, శిధిలమైపోయాయని కాలువల్లో పూడుకు తీయించి శిధిలమైన డ్రైన్లను రిపేర్లు చేయాలని, దోమల నివారణకు ఫాయింగ్ మిషన్, ప్రతిరోజు 84, వార్డులో ఒకొక్క ఏరియాలో నిర్వహించాలని, వార్డులో అన్ని ప్రాంతాల్లో కాల్వలో పేరుకుపోయిన షిల్టును తీయించాలని, తెలిపారు .ఈ సమావేశంలో జీవీఎంసీ ఇంజనీరింగ్, టి, శానిటేషన్ విభాగాల అధికారులు తెలుగుదేశం పార్టీ నాయకులు సాలాపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ పై ప్రత్యేక పోస్టల్ కవర్ విడుదల



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ ప్రత్యేక తపాలా కవర్ను విడుదల చేశారు ఈరోజు విశాఖ నగరంలో కార్యక్రమంలో , పోస్టుమాస్టర్ జనరల్ విశాఖపట్నం విజయవాడ రీజియన్ డి ఎస్ వి ఆర్ మూర్తి, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీస్ ఆదిత్య కుమార్ నాయక్, కర్నూల్ విశాఖపట్నం రీజియన్ల డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ జనార్దన్ పై, డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ వి. రోజు మేరీ ల సమక్షంలో ఏ యు వి సి ఆచార్య పీ వీ జీ డి ప్రసాద్ రెడ్డి విడుదల చేశారు. ఆరు సంవత్సరాలుగా విశాఖలో యువతకు నైపుణ్యాలు ఉపాధి కల్పన చేసే దిశగా హెచ్పిసిఎల్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ ను నిర్వహిస్తోంది. వేలాది మంది విద్యార్థులను నైపుణ్యాలతో సుసంపన్నం చేసి వారి జీవనానికి ఉపయోగకరమైన ఉపాధి అవకాశాలను అందించింది. దీనికి గుర్తుగా ఈరోజు జరిగిన కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ పై ప్రత్యేక తపాలా కవర్ ను విడుదల చేశారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ ఇన్స్టిట్యూట్ సీనియర్ మేనేజర్ కె ఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సోషల్ మీడియా ఇన్చార్జిగా కృష్ణంనాయుడు



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా అనకాపల్లి లో బుధవారంజరిగిన సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో అనకాపల్లి జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జిగా పరవాడ మండలం నాయుడుపాలెం కు చెందిన కృష్ణం నాయుడు ను జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జిగా నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లాలు ఇన్చార్జ్ మొల్లి రమణ బాబు నియామక పత్రాన్ని అందజేస్తారు. ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు బంధం పైడిరాజు జిల్లా యువజన విభాగం అధ్యక్షులు చింతకాయల కొర్లయ్య జిల్లా కార్యదర్శి బండారు సోమునాయుడు, విశాఖ జిల్లా మహిళా విభాగం నాయకులు వెంకటరమణి,పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గండి లలిత ఎలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ పి ఆదిలక్ష్మి అచ్యుతాపురం మండల మహిళా విభాగం. లీలావతి జయలక్ష్మి మునగపాక మండల అధ్యక్షులు కె నాయుడు పరవాడ మండల మహిళా విభాగం బండారు ఉమాదేవి, బీసీ నాయకులు సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ కనకమహలక్ష్మీ అమ్మవారి మార్గశిర మాసోత్సవములు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):** 24-11-2022 నుండి 23-12-2022 వరకు ఉత్సవ పర్వదినాలు, మొదటి గురువారం 24-12-2022,

రెండవ గురువారం 01-12-2022, మూడో గురువారం 08-12-2022, నాల్గవ గురువారం 15-12-2022, ఐదవ గురువారం 22-12-2022. 11-12-2022 ఆదివారము వేదసభ మరియు అర్చక సదస్సు.

**రథయాత్ర** : 17-12-2022 శనివారం సాయంకాలం 4:00 గంటల నుండి, సహస్ర ఘటాభిషేకం 22-12-2022 లక్ష్మివారం సాయంకాలం 4:00 గంటల నుండి, మహాన్నదానం. తేది 22-12-2022 గురువారం మధ్యాహ్నం 12:00 గంటల నుండి.

# 340 కేజీల బియ్యం, ఆటో సీజ్



**పాడేరు, (విశాఖ సమాచారమ్):** ప్రజా పంపిణీ వ్యవస్థకు చెందిన 340 కేజీల రేషన్ బియ్యంతో పాటు బియ్యం తరలిస్తున్న ఒక ఆటోను సీజ్ చేసినట్లు జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్. శివ ప్రసాద్ తెలిపారు. గురువారం జిల్లా పౌర సరఫరాల అధికారి ఫౌర సరఫరాల ఉప తహసిల్దార్ బి. ప్రశాంత్ కుమార్ తో కలసి పాడేరు మండలం గుత్తులపుట్టు సంతను సందర్శించి తనిఖీలు చేపట్టామన్నారు. తనిఖీ లో భాగంగా ఒక ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 340 కేజీల పిడిఎస్ బియ్యాన్ని గుర్తించి ఆటో తో పాటు సీజ్ చేయడం జరిగిందని, వీటి విలువ రూ.1,08,500లుగా లెక్క కట్టడం జరిగిందన్నారు. వీరిపై 6ఎ నోటీసులు జారీ చేసి సంయుక్త కలెక్టర్ కోర్టు లో హాజరు పరుస్తామని శివప్రసాద్ వివరించారు. ఆ వ్యక్తిపై క్రిమినల్ కేసు కూడా నమోదు చేయటం జరుగుతుందని డి ఎస్ఒ తెలిపారు. ఈ సందర్భంగా డి ఎస్ఓ మాట్లాడుతూ పిడిఎస్ బియ్యం, ఇతర ఆహార పదార్థాలు కొనుగోలు అమ్మకాలు చట్ట రీత్యా నేరమని, అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**28 లోగా ఉచిత బియ్యం పొందండి**

పిఎమ్ జికెఎవై (ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన) పథకం కింద అర్హులైన లబ్ధిదారులందరూ వారికి సరఫరా చేస్తున్న ఉచిత బియ్యాన్ని ఈ నెల 28 వ తేదీలోగా విడిపించుకోవాలని డిఎస్ఓ తెలిపారు. అర్హుల జాబితాను అన్ని సచివాలయాలతో పాటు రేషన్ డిపోలలో ప్రకటించడం జరిగిందన్నారు. లబ్ధిదారులు జాబితాను పరిశీలించి అర్హత మేరకు ఉచిత బియ్యం పొందవచ్చని వివరించారు.

## షష్ఠి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డిఎస్పి



**బిక్కవోలు, (విశాఖ సమాచారమ్):** మండలం బిక్కవోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి షష్ఠి ఉత్సవ ఏర్పాట్లను గురువారం డిఎస్పి భక్తవత్యలం పరిశీలించి తదుపరి శ్రీ గోలింగేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.కాగా ఆలయ కమిటీ చైర్మన్ జె వి వి సుబ్బారెడ్డి, ఆలయ ఈఓ, అనపర్తి సి ఐ శ్రీనివాస్,ఎస్ ఐ బుచ్చిబాబు ఆయన వెంట ఉన్నారు.

## ఆకట్టుకున్న శివలింగాల అలంకరణ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** స్థానిక విజయరామరాజుపేట శ్రీగౌరీపరమేశ్వరులమందిరము వద్ద గౌరీ యూత్ క్లబ్ సభ్యులు 516 శివ లింగాలతో పార్వతి పరమేశ్వరుల గుడిని అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటుంది.గౌరి యూత్ సభ్యులు బొడ్డేడ ప్రభు.భీమరశెట్టి భార్గవ.ఆడారి పవనకుమార్. అళ్ల సాయి.బొడ్డేడ జాన్.మల్ల అస్వంత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## ఈసీగా గోయల్ ఎంపికపై సుప్రీం వ్యాఖ్య



దిల్లీ: కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా అరుణ్ గోయల్‌ను ఎందుకంత వేగంగా నియమించారని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. గోయల్ నియామకానికి సంబంధించిన ఫైళ్లను 'మెరుపువేగం'తో ఆమోదించడంపై సర్వోన్నత న్యాయస్థానం పెదవి విరిచింది. 24 గంటలు కూడా గడవకముందే మొత్తం నియామక ప్రక్రియ ఎలా పూర్తి చేశారని రాజ్యాంగ ధర్మాసనం ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకానికి కొలీజియం వంటి వ్యవస్థను ఏర్పాటు చేయాలంటూ దాఖలైన పిటిషన్లపై విచారిస్తున్న జస్టిస్ కె.ఎం.జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగీ, జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ సి.టి.రవికుమార్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం.. కేంద్ర ఎన్నికల కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అరుణ్ గోయల్ నియామకంపై బుధవారం ప్రశ్నలు సంధించిన విషయం తెలిసిందే. ఆయన నియామక దస్త్రాలను కోర్టుకు సమర్పించాలని కేంద్రాన్ని ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు గోయల్ నియామకానికి సంబంధించిన ఫైళ్లను కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి గురువారం సమర్పించారు.

**ఒక్క రోజులోనే ఎంపిక చేశారా?**

ఈ దస్త్రాలను పరిశీలించిన రాజ్యాంగ ధర్మాసనం.. కేంద్రం తీరుపై మరోసారి అసహనం వ్యక్తం చేసింది. "ఇదేం నియామకం? ఇక్కడ మేం అరుణ్ గోయల్ సామర్థ్యాలను ప్రశ్నించట్లేదు. నియామక ప్రక్రియ గురించి మాట్లాడుతున్నాం. గోయల్ ఫైల్‌ను ఎందుకంత హడావుడిగా, వేగంగా ఆమోదించాల్సి వచ్చింది. ఫైల్ మొదలుపెట్టిన రోజే అపాయింట్‌మెంట్ ఎలా జరిగింది. ఈసీ పదవి కోసం నలుగురి పేర్లను షార్ట్‌లిస్ట్ చేసిన న్యాయశాఖ నవంబరు 18న ఆ ఫైల్‌ను ప్రధాని కార్యాలయానికి పంపించింది. అదే రోజున ప్రధాని ఒక పేరును ప్రతిపాదించారు. నలుగురి పేర్లను సిఫార్సు చేస్తే... వారిలో చిన్నవాడైన అరుణ్ గోయల్ పేరును ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారు. దీనికి అనుసరించిన పద్ధతి ఏంటి?" అని ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.

మే15వ తేదీ నుంచి కేంద్ర ఎన్నికల కమిషనర్ పోస్టు ఖాళీగా ఉందని.. నాటి నుంచి నవంబరు 18వ తేదీ వరకు ఏం జరిగిందో చెప్పాలని రాజ్యాంగ ధర్మాసనం ఏజీని నిలదీసింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టడం, అనుమానాల నివృత్తి కోసం వేసే ప్రశ్నల ద్వారా... కేంద్రానికి తాము వ్యతిరేకమని అర్థం చేసుకోకూడదని రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహిస్తున్న జస్టిస్ కేఎం జోసెఫ్ తెలిపారు.

సుప్రీం ప్రశ్నలకు అటార్నీ జనరల్ స్పందిస్తూ.. "ఎన్నికల కమిషనర్ ఎంపిక ప్రక్రియలో ఎక్కడా తప్పు జరగలేదు. గతంలో కూడా 12 నుంచి 24 గంటల్లో నియామకాలు జరిగిన సందర్భాలున్నాయి. న్యాయశాఖ ప్రతిపాదించిన నాలుగు పేర్లను డీఓపీటీ డేటాబేస్ నుంచే తీసుకున్నారు. ఆ వివరాలన్నీ బహిరంగంగానే అందుబాటులో ఉన్నాయి. ఇక, పేరు ఎంపిక సమయంలో సీనియార్టీ, పదవీ విరమణ వయసు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. వయసుకు బదులుగా బ్యాచ్ ఆధారంగా సీనియార్టీని పరిగణిస్తారు" అని బదులిచ్చారు. సుప్రీం తీరుతో ఎగ్జిక్యూటివ్‌లోని చిన్న చిన్న విషయాలను కూడా సమీక్షిస్తారా అనే ప్రశ్న తలెత్తుతోందని ఏజీ అన్నారు. ధర్మాసనం ఈ కేసులోని పూర్తి అంశాలను పరిశీలించాలని ఏజీ కోరారు.

**తీర్పు రిజర్వ్..** ఎన్నికల కమిషన్‌లో సంస్కరణలు, స్వయం ప్రతిపత్తి అంశంపై దాఖలైన పిటిషన్లపై నాలుగు రోజుల పాటు సుదీర్ఘ విచారణ జరిపిన రాజ్యాంగం ధర్మాసనం.. తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ కేసులో లిఖితపూర్వక వాదనలు దాఖలు చేసేందుకు వాద, ప్రతివాదులకు ఐదు రోజుల సమయం ఇచ్చింది. ఈసీ, సీఈసీలను పారదర్శకంగా నియమించడానికి స్వతంత్ర ప్యానెల్‌ను ఏర్పాటు చేయాలా? వద్దా? అన్న దానిపై సుప్రీంకోర్టు త్వరలో తీర్పు ఇవ్వనుంది.

## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి జిల్లాలో నేడు పర్యటన

**విజయనగరం:** రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి శ్రీ ముఖేష్ కుమార్ మీనా శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఎన్నికల కమిషన్ సిఇఓ శుక్రవారం మధ్యాహ్నం 4 గంటలకు పార్వతీపురం నుంచి విజయనగరం చేరుకొని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి, ఇ.ఆర్.ఓ.లు, ఏ.ఇ.ఆర్.ఓ.లతో సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 5-10 గం.లకు పట్టణ పరిధిలోని పోలింగ్ కేంద్రాలు సందర్శించి బి.ఎల్.ఓ.లు, బూత్ స్థాయి సిబ్బందితో మాట్లాడతారు. 5.25 గంటలకు రూరల్ పోలింగ్ కేంద్రాలు సందర్శిస్తారు. 5.45 గంటలకు విశాఖ బయలుదేరి వెళ్లనున్నారు.

## పోలీసు కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర సమాచార కమిషనర్




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):** అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయం కు ఆర్టిఐ కమిషనర్ యు .హరి ప్రసాద రెడ్డి సందర్శించి, అనకాపల్లి జిల్లా పోలీసు పి.ఐ.ఓ అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఏ.పి.ఐ.ఓ జిల్లా పోలీసు కార్యాలయం ఏ.ఓ బి.శారద ఆధ్వర్యంలో కార్యాలయ ఆర్టిఐ యాక్ట్ రిజిస్టర్, ఫస్ట్ అప్లట్ రిజిస్టర్ లను పోలీసు కార్యాలయం లోని 4(1)(బి) అప్‌డేట్ చేయబడినడిస్ప్లే బోర్డులు సమాచారాన్ని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేసిన ఆర్టిఐ కమిషనర్.ప్రజల ప్రభుత్వం నుండి సమాచారం కోరితే పారదర్శకతతో జాప్యం లేకుండా ఆ సమాచారాన్ని 30 రోజుల లోపల అందజేయాలని ఈ సందర్భంగా కమిషనర్ తెలిపారు.

# ప్రభుత్వ భవనాల నిర్మాణానికి నిధుల కొరత లేదు



**విజయనగరం:** మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద, కన్వర్జెన్సీ నిధులతో గ్రామాల్లో వివిధ ప్రభుత్వ భవనాలు నిర్మాణం జోరుగా జరుగుతోందని, పలు చోట్ల భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. సుమారు రూ.443.74 కోట్లతో జిల్లా వ్యాప్తంగా 530 గ్రామ సచివాలయాలు, 496 రైతు భరోసా కేంద్రాలు, 438 వెల్‌నెస్ సెంటర్లతోపాటు, 140 పాల శీతలీకరణ కేంద్రాలు, 173 డిజిటల్ లైబ్రరీల నిర్మాణం త్వరితగతిన జరుగుతోందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ భవనాల నిర్మాణానికి సిమ్మెంటు, ఇసుక, ఇతర సామగ్రి కూడా అందుబాటులో ఉన్నాయని, బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతోందని వివరించారు. ఇప్పటివరకు సుమారు రూ.203.34 కోట్ల విలువైన బిల్లులను చెల్లించడం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం పెండింగ్ ఉన్న రూ.16కోట్ల బిల్లులు ఈ వారంలో విడుదల కానున్నాయని తెలిపారు.

జిల్లాలో రూ.194.35కోట్ల అంచనా వ్యయంతో, 530 గ్రామ సచివాలయ భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు రూ.114.21 కోట్లను ఖర్చు చేయడం జరిగిందన్నారు. సచివాలయ భవనాల్లో కేవలం 5 భవనాలు మినహా, మిగిలినవన్నీ వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. మూడు




మాత్రమే బేస్‌మెంట్ కంటే దిగువ స్థాయిలో ఉండగా, బేస్‌మెంట్ స్థాయిలో 15, శ్లాబ్ స్థాయిలో 16, శ్లాబ్ పూర్తి అయినవి 25, రెండో శ్లాబ్ కూడా పూర్తి అయినవి 34, పూర్తి అయ్యే దశలో ఉన్నవి 77 కాగా, పూర్తి అయినవి 355 కాగా, ఇప్పటివరకు పూర్తి చేసి అప్పగించిన భవనాలు 123, మరో 55 సచివాలయ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా రూ.106.60 కోట్ల అంచనా వ్యయంతో, 496 రైతు భరోసా కేంద్రాల నిర్మాణానికి ప్రతిపాదించగా, ఇప్పటివరకు వీటికోసం రూ.53కోట్లను ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. 17 ఆర్‌బికెలు మినహా, మిగిలిన అన్ని భవనాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. 23 భవనాలు బేస్‌మెంట్ కంటే దిగువస్థాయిలో, 55 భవనాలు బేస్‌మెంట్ స్థాయిలో, 55 భవనాలు శ్లాబ్ స్థాయిలో, 38 భవనాలకు శ్లాబ్ వేయడం పూర్తి అయ్యిందని తెలిపారు. 66 ఆర్‌బికెలు చివరి దశలో ఉండగా, 242 భవనాలను నిర్మాణం పూర్తిచేసి ఇవ్వడం జరిగిందని తెలిపారు. వీటిలో 71 ఆర్‌బికెలను అప్పగించగా, వీటిలో 48 భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

జిల్లాలో సుమారు రూ.75.87 కోట్ల వ్యయంతో 438 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణానికి ప్రతిపాదించగా, ఇప్పటివరకు రూ.34.85 కోట్లను ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. 26 భవనాల నిర్మాణం ఇంకా ప్రారంభించాల్సి ఉందని, 42 భవనాలు బేస్‌మెంట్ కంటే దిగువ స్థాయిలో, 80 బేస్‌మెంట్ స్థాయిలో, 54 శ్లాబ్ స్థాయిలో, 45 శ్లాబ్ పూర్తి కాగా, 41 భవనాలు తుది దశలో ఉన్నాయని వివరించారు. ఇప్పటివరకు 150 భవనాల నిర్మాణం పూర్తికాగా, వీటిలో 21 భవనాలను ఇటీవలే అప్పగించడం జరిగిందని, మొత్తం 36 వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

జిల్లాలో రూ.38.74 కోట్లతో 140 పాల శీతలీకరణ కేంద్రాలు, రూ.28.16 కోట్లతో 173 డిజిటల్ లైబ్రరీల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

## గడప గడపన ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందచేస్తున్న ప్రభుత్వం మనది



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):** సీతానగరం రూరల్: సీతానగరం మండలం అర్ వెంకంపేట సచివాలయం పరిధిలో గల రామవరం గ్రామంలో గురువారం నాడు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రెండవ రోజున ప్రారంభించి గ్రామంలో గల ప్రతీ ఒక్క ఇంటి గడపల వద్ద ప్రజలను కలుసుకోవడం జరిగినది. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకి గ్రామం నాయకులు పెంట సూర్యనారాయణ, రెడ్డి తవిటి నాయుడు, ఎక్స్ సర్పంచ్ పెంట రామకృష్ణ, కార్యకర్తలు, గ్రామ పెద్దలు అందరూ కలిసి ఘనంగా స్వాగతం పలికి పూలమాలతో సత్కరించి ఆహ్వానం పలకడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు నాయకులు, అధికారులు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లుతో కలిసి గ్రామం చివరలో గల ఎస్సి వీది వద్దనుంచి ప్రారంభించి గ్రామంలో గల అన్ని వీధులలో తిరిగి ప్రతీ గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం వారికి అందచేసిన సహాయాన్ని వివరిస్తూ ప్రతీ ఒక్కరూ కూడా రాష్ట్ర , ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మళ్లీ సీఎం గా గెలిపించుకోవాలని అందుకు మీ అందరి ఆశీర్వాదములు కావాలి అని ఎమ్మెల్యే ప్రజలను కోరడం జరిగినది.అలానే గ్రామంలో అర్హత కలిగి సంక్షేమ పథకాలు పింఛను, వైయస్ అర్ ఆసరా, అమ్మ ఒడి, ఇంటిస్థలం, ఇల్లు, రేషన్ కార్డ్, చేదోడు ఇలా ప్రభుత్వం అందిస్తున్న ఇలా మొత్తం 32 రకాల పథకాలలో ఏఒక్కటి పొందలేక పోతున్నా వారి వివరాలను అడిగి తెలుసుకుని వారికి అర్హత మేరకు రానున్న కాలంలో సంక్షేమ పథకాలు అందేలా ఎమ్మెల్యే అధికారులచే చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల జెడ్పీటీసీ సభ్యులు మామిడి బాబ్జీ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, బి శ్రీరాములు నాయుడు, మండల వైసీపీ సీనియర్ నాయకులు పోల ఈశ్వర నారాయణ, అంబటి కృష్ణం నాయుడు, అర్వి, రత్నాకర్, ఎన్ రామకృష్ణ, టి వెంకట అప్పల నాయుడు, వివిధ గ్రామాల సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, మండల అధికారులు ఎంపిడిఓ, ఏంఅర్ఓ, ఏఓ, ఏపిఓ, ఏపిఏం, వ్యవసాయ అధికారి, హౌసింగ్ ఏఈ, ఎలక్ట్రికల్ ఏఈ, ఇతర అధికారులు, స్టేట్ డైరెక్టర్లు, వైసీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రంగస్థల రారాజు ఆచంట వెంకటరత్నం నాయుడు వర్ధంతి. (నవంబర్ 25)

ఆచంట వెంకటరత్నం నాయుడు రంగస్థల నటుడు.

ఈయన 1935, జూన్ 28 వ తేదీన కృష్ణాజిల్లా, కొండపల్లిలో జన్మించాడు. వెంకటరత్నం నాయుడు తండ్రి ఆచంట వెంకటేశ్వర్లు నాయుడు, తల్లి వెంకట నరసమ్మ. తండ్రి రంగస్థల కళాకారుడు. అదే వారసత్వంగా ఈయనకు అబ్బింది. గుంటూరు హిందూ స్కూల్లో ఎస్.ఎస్.ఎల్.సి. పాసైన ఆచంట కొంతకాలం ఆయుర్వేద మందులకి రిప్రెజెంటేటివ్‌గా పనిచేసి, వృత్తికీ, ప్రవృత్తికీ సమన్వయం కుదరక వృత్తిని వదులుకొని నాటకాలలో ప్రవేశించాడు.

తండ్రి ప్రోత్సాహంతో చిన్నప్పటి నుంచే నీతిశాస్త్రంలో శ్లోకాలు, పద్యాలు కంఠస్థం చేసి, స్పష్టమైన వాచికంతో, చక్కటి గాత్రంతో పాడుతుంటే స్కూల్లో ఉపాధ్యాయులు ప్రశంసించేవారు. కేవలం పద్యనాటకమేకాక అనేక సాంఘిక నాటకాల్లో కూడా ఆచంట



తమ ప్రతిభా పాటవాలను తెలుగు దేశ ప్రజలకి తెలియజేశాడు. గుంటూరు నాట్యసమితి ప్రదర్శించిన రామరాజు, నాయకురాలు, అపరాధి వంటి నాటకాలతో రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులను సంపాదించుకున్నాడు. తనకంటూ ఓ ముద్ర నేర్పరుచుకున్న నాయుడి ప్రతిభ చూసిన పలు నాటక సంస్థలు ఆయనకి పౌరాణిక చారిత్రక నాటకాల్లో కూడా ప్రధాన పాత్రలను ఇచ్చి ప్రోత్సహించాయి.

ఆంధ్ర లలిత కళా పరిషత్ ప్రదర్శించిన బొబ్బిలి నాటకంలో హైదర్‌జంగ్, తులాభారం నాటకంలో వసంతకుడు, సక్కుబాయి నాటకంలో కాశీపతి, రామాంజనేయ యుద్ధం లో యయాతి, హరిశ్చంద్ర లో విశ్వామిత్ర మొదలైన పాత్రలతో విజయదుందుభి మోగించాడు.

మయసభ ఏకపాత్రాభినయం నాయుడి నట జీవితంలో ఒక మైలురాయి. సాత్విక పాత్రలకంటే తామస పాత్రలు ఆయనకి ఎంతో ఇష్టం. ఆయన ప్రతిభకు మెచ్చిన అనేక సంస్థలే కాక రాష్ట్ర ప్రభుత్వం కూడా అనేక సన్మానాలు, సత్కారాలతో ఆయనని అభినందించింది. ఈలపాట రఘురామయ్య, షణ్ముఖి ఆంజనేయ రాజు, ఎ.వి. సుబ్బారావు, మాధవపెద్ది సత్యం, పీసపాటి నరసింహమూర్తి మొదలైన ఉద్ధండులైన 40 మంది నటులంతా ఒక బృందంగా ఏర్పడి తులసీ జలంధర నాటకం ప్రదర్శించారు.

డి.వి. సుబ్బారావు (హరిశ్చంద్ర పాత్రధారి) నెలకి 4 నాటకాలు ప్రదర్శించి, కళాకారులకు నెలకి కచ్చితంగా జీతాలిచ్చేవారట . దేనికైనా క్రమశిక్షణ, పట్టుదల, శ్రద్ధ ముఖ్యం అంటారు ఆచంట. బురదనాయుడు సతీసావిత్రిలో ఒరిజినల్ దున్నపోతుమీద వచ్చేవారట. విజయవాడకి సుమారు 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న 'నున్న' ప్రాంతంలో ఒక చిల్డ్రన్ నట శిక్షణాలయం స్థాపించి భావితరాలకు పద్యనాటక కళాకారులను తీర్చిదిద్దారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే హంస అవార్డు (2000),తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు (2002),సి.హెచ్.సాంబయ్య స్మారక పురస్కారం (2009),ఎన్.టి.ఆర్. రంగస్థల పురస్కారం (2001) అందుకున్నారు.

తెలుగు పౌరాణిక నాటక రంగానికి విశేషమైన సేవలను అందించిన ఆచంట వెంకటరత్నం నాయుడు తన 81వ యేట 2015, నవంబర్ 25 న కన్నుమూశారు.

**డా. జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**9490833108.**

## 26న సాలూరులో జగనన్న క్రీడా సంబరాలు



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): సాలూరులో ఈ నెల 26న జగనన్న క్రీడా సంబరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల చీఫ్ కోచ్ ఎస్. వేంకటేశ్వర రావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్ర ప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ అధ్వర్యంలో జగనన్న క్రీడా సంబరాలను రూ.50 లక్షల కాష్ ప్రైజ్ తో కబడ్డీ, వాలీ బాల్ (స్త్రీ, పురుషులు), క్రికెట్ (పురుషులకు) క్రీడా పోటీలను నియోజకవర్గ, జిల్లా, జోనల్ మరియు రాష్ట్ర స్థాయిలలో నాలుగు దశలలో నిర్వహించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఇందులో బాగంగా జిల్లాలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. 26వ తేదీన సాలూరు డిగ్రీ కళాశాల మైదానంలో నియోజకవర్గ స్థాయి ఎంపికలు ఉదయం 8 గంటల నుండి జరుగుతాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనుటకు 17 సంవత్సరాలు పైబడి వయస్సు (తేది 31.12.2005 నాటికి జన్మించిన వారు అర్హులు) కలిగి ఉండాలని, సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని చెప్పారు. ఆధార్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆసక్తి గల క్రీడాకారులు 19వ తేదీ ఉదయం 8 గంటలకు ఎంపిక పోటిలలో పాల్గొనాలని కోరారు. వివరాలకు సి.హెచ్. రవి, వ్యాయమ ఉపాధ్యాయులు ఇన్-ఛార్జ్ నిర్వహణ అధికారిని 8790113061 సంప్రదించాలని కోరారు.

## గోతుల్లో బుగ్గి ఎత్తి పారేసేలా చర్యలు చేపట్టండి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): నాయకులు పార్వతీపురం పట్టణంలోని పాత బస్టాండు, రాయగడ రోడ్డు లో ఏర్పడిన గోతుల్లో పోసిన క్రషర్ బుగ్గి లేకుండా చర్యలు చేపట్టాలని జనసేన పార్టీ నాయకులు, మున్సిపల్ కమిషనర్ ని కోరారు. గురువారం జనసేన పార్టీ జిల్లా నాయకులు వంగల దాలి నాయుడు, రాజాన రాంబాబు, సిరిపురపు గౌరీశంకర్ తదితరులు మున్సిపల్ కమిషనర్ జె. రామ అప్పలనాయుడుని కలిసి పాత బస్టాండు, రాయగడ రోడ్డులో ప్రజలను వేధిస్తున్న దుమ్ము, ధూళి పై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లో ఏర్పడిన పెద్దపెద్ద గోతులు పూడ్చాలని కోరితే, క్రషర్ బుగ్గి తెచ్చి ఆ గోతుల్లో వేసి సంబంధిత అధికారులు మరింత సమస్యలు సృష్టించారన్నారు. దీంతో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో దుమ్ము, ధూళి రేగి పాత బస్టాండ్, రాయగడ రోడ్ లో ఉన్న వ్యాపారుల సరుకులు, అక్కడ నివాసితులు ఇళ్లల్లో వంట సామాగ్రి ధూళిమవుతున్నా యన్నారు. అంతే కాకుండా చిన్న పెద్ద తేడా లేకుండా గొంతు నొప్పి, దగ్గు తదితర రోగాల పాలవుతున్నారన్నారు. తక్షణమే గోతుల్లో బుగ్గి ఎత్తి పారేసేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తక్షణమే చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రోడ్లు వేసే పరిస్థితుల్లో లేకపోయినప్పటికీ కనీసం గోతులు పూడ్చాలని కోరినా అది చేయట్లేదని అందుకే కనీసం బుగ్గయినా ఎత్తి పారేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ని కోరామన్నారు.

## 27న బిసిల ఆరాధ్య దైవం మండల్ విగ్రహావిష్కరణ



హైదరాబాద్: దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి సారిగా బీసీల ఆరాధ్య దైవం ,బీసీ రిజర్వేషన్ల పితామహులు, బీహార్ మాజీ ముఖ్యమంత్రి బిందేశ్వరి ప్రసాద్ మండల్ (బిపి మండల్) విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈ నెల 27 న తిరుపతిలో జరుగుతున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్క వెంకట్ యాదవ్ తెలిపారు.బీసీ సంఘం, బీసీ విద్యార్థి సంఘం మరియు జాతీయ అఖిల భారత యాదవ మహా సంఘం వివిధ బీసీ కుల సంఘాల నాయకుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు ఆయన తెలిపారు. వివిధ రాష్ట్రాల్లోని అనగా ఆంధ్రప్రదేశ్,తెలంగాణ,కర్ణాటక, కేరళ,తమిళనాడు రాష్ట్రాలలోని బీసీ ప్రముఖులు, అభిమానులు పాల్గొంటున్నట్లు తెలిపారు.రిజర్వేషన్ ఫలాలు అనుభవిస్తున్న మన బీసీ లు ఆ సామజిక ఉద్యమ శిఖరం మహానుభావుని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం మన నైతిక ధర్మం, కావున బి సీ సోదరులందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి జయప్రదం చేయాలని బొల్క వెంకట్ యాదవ్ పిలుపునిచ్చారు.

# విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించడమే యువజనోత్సవాల ఉద్దేశం



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): విద్యార్థులలో నిగూఢంగా ఉన్న ప్రతిభను ప్రోత్సహించడమే యువజనోత్సవాల ఉద్దేశమని స్థానిక శాసన సభ్యులు అలజంగి జోగారావు అన్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రదర్శించి ప్రతిభకు మరింత పదును పెట్టే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో గురువారం శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను శాసన సభ్యులు గురు వారం జ్యోతి ప్రజ్వలన చేసి, స్వామి వివేకానందుని చిత్ర పటానికి పూలమాల వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి వేడుకల సందర్భంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలను మొట్ట మొదటగా జిల్లాలో జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. వివేకానందుని స్ఫూర్తి, ఆలోచనా విధానం ప్రతి విద్యార్థికి ఉంటే, మరో వివేకానందుడు అవుతారని తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం యువత వల్ల సాధ్యమన్నారు. ప్రతీ విద్యార్థి గమ్యాన్ని నిర్దేశించుకుని చదవాలని ఆయన సూచించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి ఓర్పు, సహనం, గమ్యాన్ని చేరుకోవాలనే కసి,పట్టుదల ఉండాలన్నారు. ప్రతీ విద్యార్థి పట్టుదలతో కృషి చేసి జాతీయ స్థాయిలో జిల్లాకు మంచి పేరు తీసుకువచ్చుటకు ప్రయత్నించాలని కోరారు. సాంస్కృతిక పోటీలలో భాగంగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, సాంప్రదాయ గాత్రం, వాయిద్యాలు పోటీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విజయనగరం జిల్లా మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులను న్యాయ నిర్ణేతలుగా నిర్ణయించామని తెలిపారు. పోటీలో గెలుపొందిన మొదటి, ద్వితీయ,తృతీయ విజేతలకు బహుమతులు, సర్టిఫికేట్లను అందజేస్తామన్నారు. పోటీలలో ప్రధమ స్థానంలో గెలుపొందిన విజేతలను డిసెంబర్ 13 నుండి 15 వరకూ గుంటూరులో జరిగే రాష్ట్ర స్థాయి యువజనోత్సవాలకు పంపించడం జరుగుతుందని ఆయన వివరించారు. రాష్ట్ర స్థాయిలో విజేతలు 2023 జనవరి 12 నుండి 16 వరకూ జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.వివిధ కళాశాల విద్యార్థినుల ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సెట్విజ్ సి.ఇ. ఓ. బి.రామానందం, కళాశాల ప్రిన్సిపాల్ డా.చలపతిరావు, సెట్విజ్ మేనేజర్ మూర్తి, వివిధ కళాశాల లెక్చరర్స్, ఐ.ఆర్.పి.డబ్ల్యూ సంస్థ అధ్యక్షులు ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం లభిస్తుందని ఏపి ఎస్ ఎఫ్ సి విజయనగరం బ్రాంచి మేనేజరు ఎస్. శ్రీనివాస రావు అన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే విధంగా రుణ సదుపాయాలు అందుబాటులోకి తెస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ ( ఏపి ఎస్ ఎఫ్ సి) విజయనగరం బ్రాంచి ఆధ్వర్యంలో సాలూరు శివాలయం వీధిలో గల శ్రీ సీతారామ ధర్మశాలలో "పారిశ్రామికవేత్తలకు వ్యాపారాభివృద్ధి పై అవగాహన" కార్యక్రమాన్ని గురు వారం నిర్వహించారు.

బ్రాంచి మేనేజరు ఎస్. శ్రీనివాస రావు మాట్లాడుతూ కొత్తగా పరిశ్రమలు పెట్టే వారికి అవసరమైన ఆర్థిక వనరులు సమకూర్చే విధానాన్ని వివరించారు. రుణాలు పొందే విధానం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు గురించి ఆయన వివరించారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సందేహాలను నివృత్తి చేసారు. తయారీ రంగంలో వ్యాపారాలు చేసేవారిని ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని తక్కువ వడ్డీతో రుణాలు తీసుకోవడం ఉపయుక్తంగా ఉంటుందని ఆయన సూచించారు. ఈ సమావేశంలో పారిశ్రామికవేత్త గుల్లిపల్లి సంజీవిరావు, ఏపి ఎస్ ఎఫ్ సి సిబ్బంది పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి



పార్వతీపురం, (విశాఖ సమాచారమ్): పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కోన శశిధర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు, జగనన్న భూ హక్కు సర్వే నిర్వహణ, జాతీయ ఉపాధి హామీ పనులు, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు ప్లాస్టిక్ నిషేధం పగడ్బందిగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్లాస్టిక్ సంచుల వాడకం నిర్మూలించడం తోపాటు పరిసరాల పరిశుభ్రత కు ప్రాధాన్యతనివ్వాలని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో పూర్తి అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధి చెంది సుస్థిరమైన ఆదాయం సాధించేలా తోడ్పాటును అందించాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో లభించే అటవీ ఉత్పత్తులు మహిళా సంఘాలు ద్వారా విక్రయించి ఆదాయ వనరులను పెంపొందించాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతా భవన నిర్మాణాలు శత శాతం పనులు గ్రౌండింగ్ జరగాలన్నారు. జలజీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలని అన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జాయింట్ కలెక్టర్ ఓ.ఆనంద్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకట రావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కృష్ణా జి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి, జిల్లా ఆర్.డబ్ల్యు. ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా గ్రామీణాభివద్ధి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ అధికారి కె. రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా చిత్రపటం నుంచి రాలుతున్న విభూది



శ్రీసత్యసాయి జిల్లా: పెనుకొండ, సోమందేపల్లి, వినాయక్‌నగర్‌లో వింత ఘటన చోటు చేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా: పెనుకొండ, సోమందేపల్లి, వినాయక్‌నగర్‌లో వింత ఘటన చోటు చేసుకుంది. మధుమోహన్, మంజుల దంపతుల ఇంట్లో ఉన్న సాయిబాబా చిత్రపటం నుంచి విభూది రాలుతోంది. దీంతో బాబా భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా పుట్టపర్తి సత్యసాయి బాబా మహత్యమేనని కుటుంబసభ్యులు అంటున్నారు.

బాబా భక్తురాలు మంజుల సంకీర్తనకు నగిరి వెళ్లారు. అక్కడివారు సత్యసాయి చిత్రపటాన్ని ఇచ్చారు. స్వామివారి జయంతి కావడంతో గుడిలో ఉంచి పూజలు చేశారు. దీంతో స్వామి దివ్యపటం నుంచి విభూది రాలడం మొదలయ్యిందని, తమ ఇంటిలో ఈ విధంగా జరగడం ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, సాయిబాబా భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు.

# ఇక డెస్క్‌టాప్ కంప్యూటర్ల నుంచి వాట్సాప్ కాల్స్

న్యూఢిల్లీ: వాట్సాప్‌లో ఎప్పటికప్పుడు అప్ డేట్‌లను తీసుకువచ్చే మెటా, తాజాగా మరో వినూత్న యోచనను తలపెట్టింది. వాట్సాప్ డెస్క్‌టాప్ వెర్షన్‌లో కాల్స్ చేసుకునే సౌలభ్యాన్ని కల్పించే అప్‌డేట్‌పై దృష్టి పెట్టింది. మెటా అంతర్గతవర్గాల సమాచారం ప్రకారం ఇప్పటికే ప్రయోగాత్మకంగా బీటా వినియోగదారులకు కాల్స్ ట్యాబ్‌ను సంస్థ అందించింది. వాట్సాప్ నుంచి మొబైల్ ఫోన్లలో కాల్ చేసుకునే సౌకర్యం ఉండగా, డెస్క్‌టాప్ బ్రౌజర్లు లేదా యాప్‌లో ఆ అవకాశం ఇన్నాళ్లుగా లేదన్న సంగతి తెలిసిందే. తాజా అప్‌డేట్ వస్తే, ఇక డెస్క్‌టాప్ నుంచి కూడా కాల్స్ చేసుకునే వీలుంది. స్టేటస్, చాట్స్ ట్యాబ్‌లకు మధ్యలో కాల్స్ ట్యాబ్ వస్తుందని తెలుస్తోంది. కాల్ హిస్టరీ కూడా అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే డెస్క్‌టాప్‌లో అందుబాటులో ఉన్న గూగుల్ మీట్, జూమ్ వంటివాటికి వాట్సాప్ పోటీగా ఎదిగేందుకు ఈ అప్‌డేట్ ఉపకరిస్తుందని టెక్నాలజీ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఒక వాట్సాప్ ఖాతాకు ఒకే ఫోన్‌లో వాడాల్సి ఉంటుండగా, మున్ముందు కనీసం నాలుగు వేర్వేరు ఫోన్లలో ఒకే వాట్సాప్ ఖాతాను నిర్వహించుకునేలా యోచిస్తున్నామని మెటా వర్గాలు స్పష్టం చేశాయి.

## 27 విశాఖ విశ్వబ్రాహ్మణ కార్తీక వనసమారాధన జయప్రదం చేయండి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): ఈ నెల 27న విశాఖ విశ్వబ్రాహ్మణ కార్తీక వనసమారాధన జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ పిలుపు నిచ్చారు. విశాఖపట్నం ఆంధ్ర ప్రదేశ్ స్వర్ణకార సంఘ కార్యాలయంలో బీచ్ రోడ్డు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వెనుక ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ ను కలిసి విశాఖ విశ్వబ్రాహ్మణ కార్తీక వన సమారాధన కార్యక్రమానికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో శివకోటి వాసు ,ప్రముఖ పాత్రికేయు నాయకులు వేణుగోపాల్ , సురేష్ , ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు పాల్గొన్నారు.

## మలేషియా ప్రధాని గా అన్వర్ ఇబ్రహీమ్



కౌలాలంపూర్: మలేషియా మాజీ ప్రతిపక్ష నేత అన్వర్ ఇబ్రహీమ్ ఆ దేశ ప్రధాని అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ రాకపోవడంతో అక్కడ ప్రతిష్టంభన ఏర్పడిన విషయం తెలిసిందే. అయితే ఆ దేశ చక్రవర్తి సుల్తాన్ అబ్దుల్లా.. కొత్త ప్రధానిని నియమించారు. అన్వర్ లేదా మాజీ ప్రధాని యాసిన్ ఇటీవల ముగిసిన ఎన్నికల్లో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన స్వల్ప మెజారిటీ కూడా సాధించలేకపోయారు. చక్రవర్తి సుల్తాన్ సమక్షంలో మలేషియా ప్రధానిగా అన్వర్ ఇబ్రహీమ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మలేషియాకు అన్వర్ పదవ ప్రధాని కానున్నారు.అన్వర్‌కు చెందిన పకాటన్ హర్పన్ (పీహెచ్) పార్టీ శనివారం జరిగిన ఎన్నికల్లో ఎక్కువ సంఖ్యలో సీట్లు గెలిచింది. కానీ ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సినన్ని సీట్లను ఆ పార్టీ గెలవలేకపోయింది. అయితే ఏ పార్టీలు కూటమిగా మారుతాయో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. అయిదు రోజుల పాటు చర్చలు జరిగినా.. ప్రభుత్వ ఏర్పాటుపై ఎటువంటి నిర్ణయం వెలుబడలేదు.1990 దశకంలో మలేషియా డిప్యూటీ ప్రధానిగా అన్వర్ చేశారు. అప్పట్లో మాజీ ప్రధాని మహతిర్ స్థానంలో అన్వర్ వస్తారని ఆశించారు.

## నేడు ఆదాయ పన్ను టిడిఎస్ నిబంధనలపై అవగహన కార్యక్రమం

విజయనగరం: జిల్లాలోని డిడిఒలందరు జిల్లా కలక్టరేటు ఆడిటోరియంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు జరిగే ఆదాయ పన్ను టిడిఎస్ నిబంధనలపై జరిగే అవగహన కార్యక్రమంనకు తప్పక హాజరుకావాలని జిల్లా కలక్టరు ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఆదాయ పన్ను టి.డి.ఎస్. నిబంధనలకు అనుగుణంగా డి.డి.ఓలు అనుసరించాల్సిన చర్యలపై ఆదాయ పన్ను అధికారులు పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. ముఖ్యంగా కొత్త జిల్లాలు ఏర్పాటైన నేపథ్యంలో నూతనంగా డి.డి.ఓ.లు నియామకం కావడం, కొత్త కార్యాలయాలు ఏర్పాటు కావడం జరిగిందని, దీనిని దృష్టిలో వుంచుకొని కొత్త డి.డి.ఓ.లు అయిన వారికి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా కార్యక్రమ నిర్వహిస్తున్నట్లు పేర్కోన్నారు. ఉప సంచాలకులు జిల్లా ట్రజరీ విజయనగరం వారి సమన్వయంతో ఈ సమావేశం నిర్వహణ జరుగుతుందని తెలిపారు.

## రష్యాను ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా ప్రకటించిన ఈయూ పార్లమెంట్

న్యూఢిల్లీ: ఉక్రెయిన్ యుద్ధాన్ని కొనసాగిస్తున్న రష్యాను ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా ప్రకటించే తీర్మానానికి యూరోపియన్ పార్లమెంటు మద్దతు పలికింది. ఉక్రెయిన్‌లో పౌరులే లక్ష్యంగా స్కూళ్లు, దవాఖానలు, విద్యుత్ కేంద్రాలపై రష్యా సైన్యం దాడులకు పాల్పడుతున్నదని, ఇది అంతర్జాతీయ చట్టాలను అతిక్రమించడమేనని స్పష్టం చేసింది. ఈ తీర్మానంపై ఐరోపా పార్లమెంటులో ఓటింగ్ నిర్వహించగా.. 494 మంది సభ్యులు మద్దతు పలుకగా, 58 మంది వ్యతిరేకించారు. మరో 44 మంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. యూరోపియన్ పార్లమెంట్ రష్యాను ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా తీర్మానించడాన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్వాగతించారు. తమ దేశంపై దురాక్రమణకు పాల్పడుతున్న రష్యా.. ఉక్రేనియన్లే లక్ష్యంగా దాడులు చేస్తున్నందతూ ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ దేశాన్ని ఉగ్రవాద ప్రోత్సాహక దేశంగా ప్రకటించాలని అమెరికాతోపాటు ప్రపంచ దేశాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. దీంతో ఉక్రెయిన్-రష్యా యుద్ధం వల్ల ఆర్థికంగా, విద్యుత్, చమురు పరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్న యూరిపియన్ దేశాలు ఈ తీర్మానానికి మద్దతు తెలిపాయి. ఈ తీర్మానానికి మద్దతు తెలపడానికి అమెరికా నిరాసక్తత వ్యక్తంచేస్తున్నది.కాగా, ఐరోపా పార్లమెంటు తీర్మానంపట్ల రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. యూరోపియన్ పార్లమెంటును మూర?త్వానికి స్పాన్సర్‌గా నియమించాలని ప్రతిపాదిస్తున్నానని ఆ దేశ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి మరియా జఖరోవా వ్యాఖ్యానించారు.

# లవంగం నూనె వల్ల ఉపయోగాలు



లవంగాన్ని చాలా మంది కేవలం మసాలా దినుసుగానే భావిస్తారు. కానీ లవంగం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని చాలా కొద్ది మందికి మాత్రమే తెలుసు. తూర్పు ఆసియా ప్రాంతాల్లో లవంగాన్ని ఆయుర్వేద వైద్యంలో విరివిగా వాడతారు. సాంప్రదాయ చైనీస్ వైద్యంలో లవంగాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు. కూరలకు, ముఖ్యంగా బిర్యానీకి రుచి, సువాసనను జోడిస్తుంది లవంగం.

లవంగాన్ని కేవలం మసాలా దినుసుగానే కాకుండా లవంగం నూనెను విరివిగా వాడతారు. లవంగం చెట్టు యొక్క ఆకులు, కాండం, ఎండిన మొగ్గలను వివిధ ఔషధ మరియు ఆరోగ్య ప్రయోజనాల కోసం ఉపయోగిస్తారు. అధిక యాంటీమైక్రోబయల్, యాంటీ ఫంగల్, యాంటీవైరల్, యాంటిసెప్టిక్, స్టిమ్యులేటింగ్ లక్షణాల కోసం లవంగం నూనె వివిధ వ్యాధులకు ఒక ప్రసిద్ధ గృహ వైద్యంగా పరిగణించబడుతోంది.

**1. బలమైన రోగనిరోధక శక్తి:** లవంగం నూనె మీ రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పని చేస్తుంది. నూనెలో ఉండే యాంటీఆక్సిడెంట్ గుణం క్యాన్సర్, గుండె జబ్బుల వంటి వివిధ వ్యాధులకు కారణమయ్యే ఫ్రీ రాడికల్స్‌కు వ్యతిరేకంగా స్కావెంజర్‌గా పనిచేస్తుంది. లవంగం యొక్క ఎండిన పూల మొగ్గలో తెల్ల రక్త కణాల సంఖ్యను పెంచడం ద్వారా రోగనిరోధక వ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడే సమ్మేళనాలు ఉన్నాయి.

**2. ఇన్ఫెక్షన్లతో పోరాడుతుంది:** అనేక క్రిమినాశక లక్షణాలతో ఆశీర్వదించబడిన లవంగం నూనెను గాయాలు, ఫంగల్ ఇన్ఫెక్షన్లు, కీటకాలు కాటు, కుట్టడం వంటి వాటికి చికిత్స చేయడానికి ఉపయోగించవచ్చు. అయితే, లవంగం నూనెను నేరుగా ఉపయోగించడం హానికరం. గాయం మరీ ఎక్కువగా ఉంటే లవంగం నూనెలో బాదం లేదా కొబ్బరి నూనె వేసి పలుచన చేయడం మంచిది. ఈ క్యారియర్ నూనెలు మీ సున్నితమైన చర్మాన్ని లవంగం నూనెను నేరుగా పూయడం వల్ల సంభవించే కాలిన గాయాల నుండి నిరోధిస్తాయి.

**3. గొంతు నొప్పి, దగ్, జలుబుతో పోరాడుతుంది** : దాని అధిక శోథ నిరోధక లక్షణాలు, లవంగం నూనె గొంతు నొప్పి, దగ్గు, జలుబు మరియు సైనసైటిస్ సమయంలో ఉపయోగపడుతుంది. అద్భుతమైన ఎక్స్‌పెక్టొరెంట్ లవంగం నూనెను తీసుకోవడం వల్ల నాసికా మార్గాన్ని క్లియర్ చేయడమే కాకుండా శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. అయితే ఇది నాసికా కుహరం మరియు గొంతుపై శీతలీకరణ ప్రభావాన్ని కలిగి ఉంటుంది.

**4. మీ చర్మానికి మంచిది** : లవంగం నూనె సబ్బులు, లోషన్లు మరియు పెర్ఫ్యూమ్‌లలో కూడా లభిస్తుంది. లవంగం నూనెలో యూజీనాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ బాక్టీరియల్ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇది మొటిమలను నయం చేయడంలో ప్రభావవంతంగా ఉంటుంది. వాపును తగ్గిస్తుంది. అదే సమయంలో అంటు బ్యాక్టీరియాను చంపుతుంది. 2 నుండి 3 చుక్కల స్వచ్ఛమైన లవంగం నూనెను మీ స్కిన్ క్రీమ్‌తో కలపండి. మెత్తగా అప్లై చేయండి. లవంగం నూనె యాంటీ ఏజింగ్ సంకేతాలతో పోరాడటానికి కూడా సహాయపడుతుంది. లవంగం నూనెను కొన్ని చుక్కలను కాటన్ ముక్కపై వేసి, రోజుకు కనీసం రెండుసార్లు మీ ముఖానికి అప్లై చేయండి. ముడతలు మరియు కుంగిపోయిన చర్మం విషయంలో మీరు గుర్తించదగిన మార్పును చూస్తారు. లవంగం నూనెలోని స్టిమ్యులేటింగ్ లక్షణాలు చనిపోయిన చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేస్తుంది. రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. ఇది మీ చర్మం యవ్వనాన్ని పునరుద్ధరించడంలో సహాయపడుతుంది.

**5. అందమైన జుట్టు కోసం** : లవంగం నూనె మీకు అందమైన జుట్టును కూడా అందిస్తుంది. మీ తలపై లవంగం నూనెను అప్లై చేయడం వల్ల రక్త ప్రసరణను పెరుగుతుంది. ఇది జుట్టు రాలడాన్ని తగ్గిస్తుంది. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఇది డ్రై, డల్ హెయిర్‌కి అవసరమైన షైన్‌ని కూడా ఇస్తుంది. ఆలివ్ నూనెతో కలిపిన కొద్ది మొత్తంలో లవంగం నూనె కూడా గొప్ప కండీషనర్‌గా పని చేస్తుంది. ఉత్తమ ఫలితాల కోసం, ఈ మిశ్రమాన్ని తడి జుట్టు మీద అప్లై చేసి, దాని చుట్టూ వెచ్చని టవల్‌ను చుట్టండి. ఇరవై నిమిషాలు అలాగే ఉండనివ్వండి మరియు చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి.

# ఈ పువ్వుతో.. క్యాన్సర్‌కు చెక్ పెట్టండి..!



శీతాకాలంలో ఎక్కువగా దొరికే కూరగాయలలో క్యాలీఫ్లవర్ ఒకటి. క్యాలీఫ్లవర్‌తో కూర, వేపుడు, మంచూరియా, క్యాలీఫ్లవర్ పకోడీలూ, రైస్ ఐటమ్స్ కూడా చేసుకోవచ్చు. క్యాలీఫ్లవర్‌ను ఎలా చేసినా టేస్ట్ మాత్రం అదుర్స్ అనిపిస్తుంది. క్యాలీఫ్లవర్ సూపర్ ఫుడ్‌గా నిపుణులు అభివర్ణిస్తారు. దీనిలో మెండుగా ఉండే పోషకాలు.. మన ఆరోగ్యానికి మేలు చేస్తాయని అంటున్నారు. క్యాలీఫ్లవర్‌లో టమిన్-బి, సి, కెలతో పొటాషియం, క్యాల్షియం, ఫొలేట్, ప్రొటీన్లు, ఐరన్, సోడియం, పాస్ఫరస్ , మాంగనీస్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. క్యాలీఫ్లవర్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియా, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి. ఇవి వివిధ రకాల ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని కాపాడతాయి.

ఇందులోని సల్ఫోరఫేన్ అనే యాంటీఆక్సిడెంట్ గుండె జబ్బులను నివారిస్తుందని వివిధ అధ్యయనాల్లో తేలింది. క్యాలీఫ్లవర్‌లోని పోషకాలు రక్త నాళాలు బిరుసెక్కడం, రక్తపోటు లాంటి సమస్యలను నివారిస్తుంది. రక్తం ఐరన్‌ను గ్రహించడంలో తోడ్పడుతుంది. అందువల్ల హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుంది. కాలిఫ్లవర్‌లో కొలెస్ట్రాల్ దాదాపుగా ఉండదు కాబట్టి గుండెజబ్బులు ఉన్న వాళ్ల తింటే మంచిది. అలాగే అన్ని రకాల గుండెజబ్బులను అది నివారిస్తుంది.

**స్ట్రెస్ దూరం అవుతుంది..** క్యాలీఫ్లవర్‌లోని గ్లూకోబ్రాసిసిన్, గ్లూకోరాఫనిన్, గ్లూకోనాస్టిన్‌లు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. క్యాలీఫ్లవర్‌లో కోలిన్ ఉంటుంది. ఇది జ్ఞాపకశక్తికి, నరాల వ్యవస్థకు కోలిన్ కీలకం. మనలో చాలామంది కొన్ని సార్లు సడెన్‌గా మూడ్ బాగోకపోవడం, ఏ పని చేయాలనిపించదు. ఇలాంటి వారికి క్యాలీఫ్లవర్ మెడిసిన్‌లా పనిచేస్తుంది. దీనిలోని కొలీన్ మెదడు పనితీరుని మెరుగుపరచడంతో పాటు అల్జీమర్స్ లాంటి సమస్యలు రాకుండా రక్షణ కలిగిస్తుంది. క్యాలీఫ్లవర్‌లోని యాంటీ ఆక్సిడెంట్లు శారీరక, మానసిక ఇబ్బందులను తొలగించి ఉత్సాహంగా ఉంచుతాయి.

**ఎముకలు స్ట్రాంగ్‌గా ఉంటాయి..** శరీరంలో విటమిన్ కె లోపం ఉంటే.. ఎముకలు పెళుసుబారడం, విరగడం, ఆస్టియో పొరాసిస్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. క్యాలీఫ్లవర్‌లో విటమిన్ కె పుష్కలంగా ఉంటుంది. దీన్ని తరచుగా మన డైట్‌లో తీసుకుంటే.. ఎముకలు స్ట్రాంగ్‌గా ఉంటాయి. ఇందులోని కె విటమిన్.. గాయాలను త్వరగా నయం చేస్తుంది.

**క్యాన్సర్‌కు చెక్..** క్యాలీఫ్లవర్ యాంటీ క్యాన్సర్, యాంటీఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. కాలీఫ్లవర్‌లోని ఇండోల్-3 కార్బినాల్ అనే స్టైరాల్ క్యాన్సర్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంది. కాలిఫ్లవర్ తరచుగా తీసుకుంటే.. ప్రోస్టేట్, పెద్దపేగు, రొమ్ము, ఒవేరియన్ క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి

**నోటి ఆరోగ్యానికి మంచిది..** క్యాలీఫ్లవర్ వ్యాధినిరోధక శక్తిని పెంచడంతో పాటు దంతాలనూ చక్కగా మెరిపిస్తుంది. ఇందులో పీచు ఎక్కువ కాబట్టి తినేటప్పుడు నోట్లో లాలాజలం ఊరుతుంది. ఇది దంతాల ఎనామిల్‌పై మరకలు పడకుండా చూస్తుంది.

# నెయ్యి గురించి మనకు తెలియని నిజాలు



నెయ్యితో శరీరంలో కొవ్వుల స్థాయి పెరిగిపోయి, మనకు హాని చేస్తుందన్న అపోహ చాలా మందిలో ఉంటుంది. నెయ్యితో బరువు పెరిగిపోతామన్న భయంతో దీన్ని దూరం పెట్టే వారు కూడా ఉన్నారు. నిజానికి నెయ్యితో ఎన్నో ప్రయోజనాలు కూడా ఉన్నాయన్న విషయం చాలా మందికి తెలియదు.

వైట్ రైస్ తినడం మంచిది కాదన్న సలహా వినే ఉంటారు. ఎందుకంటే వైట్ రైస్ లో ఉన్నదంతా కార్బోహైడ్రేట్స్. వెంటనే రక్తంలో కలిసిపోయి సమస్యలకు కారణమవుతుంది. కానీ, 20 ఏళ్ల క్రితం మన పెద్దలు వైట్ రైస్ కడుపునిండా తిని ఆరోగ్యంగానే ఉన్నారు కదా. కారణం నెయ్యి. అన్నంలో నెయ్యి కలుపుకుని తినడం వల్ల కార్బోహైడ్రేట్స్ వెంటనే రక్తంలో కలవకుండా నిదానంగా ఈ ప్రక్రియ జరుగుతుంది. దానివల్ల బ్లడ్ గ్లూకోజ్ ఒక్కసారిగా పెరిగిపోదు. నెయ్యి మన రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. చర్మం ఆరోగ్యానికి, శారీరక, మానసిక బలానికి (జ్ఞాపకశక్తి) నెయ్యి మేలు చేస్తుంది. ముఖ్యంగా శీతాకాలంలో నెయ్యిని తప్పకుండా తీసుకోవాలి. దీనివల్ల ఈ కాలంలో అదనపు ప్రయోజనాలున్నాయి.

**వింటర్ లో మంచిది:** శీతాకాలంలో నెయ్యిని తీసుకోవడం వల్ల శరీరానికి వేడినిస్తుంది. అధిక వేడిని (400 డిగ్రీల ఫారిన్ హీట్ వరకు) తట్టుకునే శక్తి నెయ్యికి ఉంది. కనుక వంటల్లో వాడుకోవచ్చు.

జీర్ణరసాల ప్రేరణకు నెయ్యి తోడ్పడుతుంది. అందుకే ఆహారంతో పాటు నెయ్యిని తీసుకోవడం వల్ల తిన్నది మంచిగా జీర్ణమవుతుంది.

నెయ్యికి యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్ ఫ్లమ్మేటరీ గుణాలు ఉన్నాయి. కనుక దగ్గు, జలుబు తగ్గేందుకు సాయపడుతుంది. స్వచ్ఛమైన ఆవు నెయ్యి రెండు చుక్కల చొప్పున రెండు నాసికా రంధ్రాల్లో వేసుకుంటే తక్షణ ఉపశమనం దక్కుతుంది.

ఇక ఈ కాలంలో చర్మం పొడిబారి, చర్మ సమస్యలు కనిపిస్తుంటాయి. వీటికి నెయ్యి చక్కని పరిష్కారం. నెయ్యిని తీసుకోవడం వల్ల చర్మంలో తేమ శాతం పెరుగుతుంది.

**చపాతీకి నెయ్యి జోడించండి..** ఇక చపాతీ తినే వారు దానికి నూనెకు బదులు నెయ్యి జోడించుకోవడం వల్ల కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్ ఫుడ్ గా మారిపోతుంది. దీనివల్ల మరింత మంచి ఫలితాలు కనిపిస్తాయి. ఉత్తరాదిలో చపాతీలను నెయ్యితో చేసుకుని తింటుంటారు. దీనివల్ల చపాతీల గ్లైసిమిక్ ఇండెక్స్ వ్యాల్యూ తగ్గుతుంది. అంటే బ్లడ్ గ్లూకోజ్ వెంటనే పెరగదు. హార్మోన్ల సమతుల్యతకు, బరువుతగ్గడానికి కూడా నెయ్యి సాయపడుతుంది.

# భోజనం చేసే సమయంలో నీటిని తాగుతున్నారా..



నీరు అనేది సమస్త ప్రాణకోటికి అత్యంత ఆవశ్యకమైన పదార్థం. నీరు లేకపోతే భూమిపై ఉండే ఏ జీవి మనుగడ సాధించలేదు. ఆహారం లేకుంటే కొన్ని రోజులైనా బతకగలం కానీ నీరు లేనిదే ఒక్క పూట కూడా జీవించలేని పరిస్థితి. నీరు ఆరోగ్యానికి చాలా అవసరం. రోజుకు కనీసం 3 లీటర్ల నీరు తాగాలని వైద్యులు చెబుతంటారు. నీటిని ఎంత ఎక్కువగా తాగితే అంత ఆరోగ్యంగా ఉంటారని నిపుణులు చెబుతున్నారు. అయితే చాలా మంది భోజనం చేసే సమయంలో మధ్య మధ్యలో నీళ్లు తాగుతుంటారు. కొంతమంది భోజనం చేయడానికి ముందు మంచి నీరు తాగుతారు. అయితే ఇలా మధ్య మధ్యలో నీళ్లు తాగడం మంచిదేనా అనే విషయంపై నిపుణులు ఆసక్తికర విషయాలను చెబుతున్నారు. భోజనం మధ్యలో నీళ్లు తాగడం వల్ల ఆహారం జీర్ణం అవడం కష్టం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల టాక్సిన్స్ పేరుకుపోతుం దని, ఆయుర్వేదం ప్రకారం కూడా భోజనం మధ్యలో నీళ్లు తాగొద్దనే విషయాన్నే చెబుతోందని వివరిస్తున్నారు. భోజనంతో పాటు నీటిని తాగడం వల్ల ప్రొటీన్లు, విటమిన్లు, పోషకాలను జీర్ణం చేసుకోవడం ఆలస్యం అవుతుందని, ఇది జీర్ణక్రియ సక్రమంగా సాగేందుకు అవరోధం కలిగిస్తుందని చెబుతున్నారు.

భోజనం చేసే సమయంలో ఎలాంటి నీటిని తాగుతున్నారనే విషయం పట్ల కూడా అప్రమత్తంగా ఉండాలి. ఆల్కలిన్ వాటర్ పొట్టలోని ఆమ్లాలు మరింత పెంచుతాయి. భోజనం చేసిన తర్వాత నీళ్ల తీసుకోవడం అనేది శరీరం తీరుపై ఆధారపడి ఉంటుంది. అవసరం లేదనుకుంటే అన్నం తిన్న కొద్దిసేపటి తర్వాత తాగడమే మంచిది. అయితే.. భోజనం మధ్యలో నీరు తాగకుండా ఉండటమే మంచిది అనే విషయాన్ని నిరూపించేందుకు సైంటిఫిక్ గా ఎటువంటి అధ్యయనాలు లేవని నిపుణులు స్పష్టం చేశారు.

అయితే.. స్నానానికి ముందు ఒక గ్లాస్ వాటర్ తాగడం వల్ల రక్త పోటు అదుపులో ఉండటమే కాకుండా కంట్రోల్ లో ఉంటుంది. కొంత మందికి వేడి నీటితో స్నానం చేసిన తర్వాత నీళ్ల తాగాలని అనిపిస్తుంది. జీర్ణక్రియకు సహాయపడటానికి భోజనానికి 30 నిమిషాల ముందు ఒక గ్లాసు నీరు తాగాలి. అయితే ఎక్కువ మొత్తంలో నీటిని తాగవద్దు. ఇలా చేయడం వల్ల జీర్ణ రసాలు పలచన అవుతాయి. ఆహారం తీసుకున్న ఒక గంట తర్వాత నీటిని తాగితే మంచి ప్రయోజనాలు కలుగుతాయి.

# మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఈ ఆహారం చాలా సహాయపడుతుంది



బిజీ వర్క్, అనారోగ్య జీవనశైలి మరియు ఒత్తిడితో కూడిన పని షెడ్యూల్ కారణంగా నేటి తరం ఒత్తిడి, డిప్రెషన్ మరియు పరధ్యానానికి గురవుతున్నారు. ఇవి మానసిక ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా శారీరక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తాయి.

కాబట్టి, మానసిక సమస్యల నుండి మనల్ని మనం కాపాడుకోవడం చాలా ముఖ్యం. దీన్ని దృష్టిలో ఉంచుకుని, పోషకాహార నిపుణుడు లోవ్‌నీత్ బాత్రా మీ మానసిక ఆరోగ్యాన్ని పెంచడంలో, ఆందోళన లక్షణాలను తగ్గించడంలో మరియు మంచి మెదడు ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో చాలా ప్రభావవంతమైన కొన్ని పోషకాలు ఉన్నాయని చెప్పారు.

నేటి హడావిడి జీవితంలో, సందడి నుండి దూరంగా ఉండటం అంత సులభం కాదు. అయితే, మీ మానసిక ఆరోగ్యాన్ని మీ ఆహారం ద్వారా కూడా మెరుగుపరచవచ్చు. పోషకాహార నిపుణుడు లోవ్‌నీత్ బాత్రా మాట్లాడుతూ, సరైన ఆహారాన్ని అనుసరించడం వల్ల మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది మరియు మానసిక వ్యాధులను నివారించవచ్చు. మీ ఆహారంలో చేర్చుకున్నప్పుడు గొప్ప ప్రయోజనం కలిగించే కొన్ని పోషకాలు ఇక్కడ ఉన్నాయి:

మెగ్నీషియం ఇది నాడీ వ్యవస్థను పోషించే మరియు శాంతపరిచే ఖనిజం. ఆందోళన, భయం, చంచలత్వం మరియు చిరాకు నుండి ఉపశమనానికి సహాయపడుతుంది. మీరు పొద్దుతిరుగుడు విత్తనాలు, వాల్‌నట్‌లు, అరటిపండ్లు, ఆప్రికాట్లు మరియు ఆకుపచ్చ ఆకు కూరలలో ఈ పోషకాలను సమృద్ధిగా కనుగొనవచ్చు.

ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు మూడు రకాల కొవ్వు ఆమ్లాలలో, ALA, EPA మరియు DHA, ఈ PA ఒత్తిడిని తగ్గించడంలో బాగా సహాయపడుతుంది. ఈ మంచి కొవ్వు ఆమ్లాలను శరీరానికి చేర్చడానికి చియా విత్తనాలు, అవిసె గింజలు మరియు నెయ్యిని క్రమం తప్పకుండా తినండి.

B విటమిన్లు B విటమిన్లు ఎనిమిది విభిన్న పోషకాల సమూహం, ముఖ్యంగా B6, B9 (ఫోలిక్ యాసిడ్) మరియు B12 నాడీ వ్యవస్థను మెరుగుపరచడంలో మరియు ఒత్తిడిని నిర్వహించడంలో సహాయపడతాయి. వేరుశెనగ, చిక్కుళ్లు, పచ్చి ఆకు కూరలు తీసుకోవడం ద్వారా వీటిని పొందవచ్చు.

జింక్/జింక్ మన శరీరంలో జింక్ కంటెంట్ తక్కువగా ఉన్నప్పుడు, అది GABA మరియు గ్లూటామేట్ స్థాయిలను తగ్గిస్తుంది మరియు ఒత్తిడిని పెంచుతుంది. కాబట్టి మనం జింక్ రిచ్ గార్డెన్ క్రేస్ సీడ్స్ / ఆలివ్ / హలీమ్ గింజలు మరియు పప్పులను తీసుకోవడం ద్వారా ఈ దుష్ప్రభావాన్ని నివారించవచ్చు.

చాలా మందికి విటమిన్ డి లోపం లేదా లోపం ఉంటుంది. మెదడు మరియు మానసిక స్థితిని నియంత్రించడంలో ఇది చాలా సహాయపడుతుంది. మానసిక వ్యాధులతో బాధపడేవారికి విటమిన్ డి లోపం ఉందని చాలా అధ్యయనాలు చెబుతున్నాయి. గుడ్డు సొనలు, పుట్టగొడుగులు, పాల ఉత్పత్తులు లేదా సప్లిమెంట్లను తినడం వల్ల విటమిన్ డి పొందడం ద్వారా మీ మానసిక ఆరోగ్యాన్ని పెంచుకోవచ్చు.

# గోర్లపై తెల్లటి మచ్చలు...



ఆరోగ్యంపై ప్రభావం చూపించే వివిధ రకాల వ్యాధులకు సంకేతాలు వివిధ రూపాల్లో వెలుగుచూస్తూనే ఉంటాయి. అందులో ఒకటి గోర్లపై ఏర్పడే తెల్లటి మచ్చలు. ఈ మచ్చలుంటే నిర్లక్ష్యం చేయకూడదు. ఇది ప్రమాదకర ల్యూకోనీషియా కావచ్చు.

చేతి వేళ్లకుండే గోర్లు ఆరోగ్యానికి సంబంధించిన చాలా అంశాల్ని సూచిస్తుంటాయి. శరీరంలో ఏదైనా వ్యాధి ఉంటే..ముందుగా గోర్లపై ఆ ప్రభావం కన్పిస్తుంది. గోర్లపై తెల్లటి మచ్చలు కన్పిస్తే దాని వెనుక చాలా కారణాలుండవచ్చు. గోర్లపై తెల్లటి మచ్చలకు కారణం సాధారణమైంది మాత్రం కాదంటున్నారు. ల్యుకోనీషియా కావచ్చంటున్నారు వైద్య నిపుణులు. ల్యుకోనీషియా అనేది గోర్లకు గాయం ఏర్పడితే వస్తుంది. గోర్లు పాడైపోతాయి. రంగు మారుతుంది. అసలు గోర్లపై తెల్లటి మచ్చలకు కారణాలేంటనేది తెలుసుకుందాం..

**గోర్లపై తెల్లటి మచ్చలకు కారణాలు-ఎలర్జిక్ రియాక్షన్:**

గోర్లపై తెల్లడి మచ్చల వెనుక కారణం ఎలర్జిక్ రియాక్షన్ కూడా కావచ్చు. నెయిల్ పాలిష్, గ్లాస్ లేదా నెయిల్ పాలిష్ రిమూవర్ సైతం కారణం కావచ్చు. గోర్లపై తెల్లటి మచ్చలు ఎలర్జీ కారణంగా కూడా వస్తుంటాయి. ఆర్టిఫిషియల్ నెయిల్స్‌తో కూడా గోర్లకు హాని చేకూరుతుంది.

**ఫంగల్ ఇన్‌ఫెక్షన్:** ఫంగల్ ఇన్‌ఫెక్షన్ కారణంగా గోర్లపై తెల్లటి మచ్చలు ఏర్పడవచ్చు. ఇన్‌ఫెక్షన్ తొలి లక్షణం గోర్లపై తెల్లటి మచ్చలు రావడమే. అంతేకాదు..ఇన్‌ఫెక్షన్ పెరిగితే..గోర్లు లావుగా, డ్రైగా మారతాయి. అందుకే గోర్లపై తెల్లటి మచ్చలుంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాల్సి ఉంటుంది.

**గోర్లకు గాయం:** చాలా సందర్భాల్లో గోర్లకు దెబ్బలు తగులుతుంటాయి. దెబ్బ తగిలిన 3 వారాల తరువాత గోర్లపై తెల్లటి మచ్చలు ఏర్పడుతుంటాయి. అందుకే నిర్లక్ష్యం చేయకూడదు.

**మినరల్స్ లోపం:** శరీరంలో మినరల్స్ లేదా విటమిన్ల లోపముంటే గోర్లపై తెల్లటి మచ్చలు ఏర్పడతాయి. జింక్ లేదా కాల్షియం లోపంతో సాధారణంగా ఇలాంటి మచ్చలు కన్పిస్తుంటాయి. ఇలాంటి మచ్చల్ని తొలగించేందుకు యాంటీ ఫంగల్ మందులు వాడాలి. రక్తంలో ఎలాంటి సమస్య తలెత్తినా వైద్యుడిని సంప్రదించాలి. కాస్మొటిక్స్ ఎక్కువగా వాడకూడదు.

# లవ్ యూ నాన్న.. మహేష్ బాబు



కృష్ణ మృతిపై ఆయన కుమారుడు ప్రిన్స్ మహేశ్ బాబు భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు.

సూపర్ స్టార్ కృష్ణ గుండె పోటుతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆయన మరణంతో టాలీవుడ్ ఇండస్ట్రీ శోక సంద్రంలో మునిగిపోయింది. పలువురు సెలబ్రిటీలు కృష్ణ మృతికి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కృష్ణ మృతిపై ఆయన కుమారుడు ప్రిన్స్ మహేశ్ బాబు తాజాగా భావోద్వేగంగా స్పందించారు. సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు.

"మీ జీవితం ఓ ఉత్సవం... మీ నిష్క్రమణం కూడా అంతకుమించిన వేడుకే. అదీ మీ ఔన్నత్యం. నిర్భయంగా జీవించారు మీరు, డేరింగ్ అండ్ డాషింగ్ మీ తత్వంగా బ్రతికారు. మీరు చప్పున దూరంకావడంతో - నా స్ఫూర్తి... నా ధైర్యం ఇంకా ఏ ఉన్నత విలువలు నాకు అత్యంత ముఖ్యమనుకున్నానో అవన్నీ క్షణంలో మాయమైపోయాయి. కానీ చిత్రంగా, అంతకు ముందెన్నడూ లేని బలం ఇప్పుడు నాకు అనుభవంలోకి వచ్చింది. నేనిప్పుడు నిర్భయుడ్ని.... మీ జ్యోతి వెలిగిస్తుంది నన్ను ఎప్పటికీ. మీ వారసత్వాన్ని మున్ముందుకు తీసికెళ్తాను. మీరు మరింత గర్వపడేలా చేస్తాను. లవ్ యూ నాన్న, మీరే నా సూపర్ స్టార్" అని మహేశ్ బాబు ట్విట్టర్‌లో పోస్ట్ పెట్టారు.

## రాజీనామా చేసిన వ్యక్తి మళ్ళీ ఎన్నికల్లో పోటీ చెయ్యకూడదు: జేడీ



కాకినాడ: ఏపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు సంక్షేమ పథకాలు అంటూ అప్పులు చేసుకుంటూ పోతున్నాయని తప్పుబట్టారు. అప్పులు ఎక్కువ ఉన్న రాష్ట్రాలపై ఇన్వెస్టర్లు ఆసక్తి చూపరని తెలిపారు. అందుకే మన రాష్ట్రానికి వచ్చే ఇన్వెస్టర్లు పక్క రాష్ట్రానికి తరలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో తాను తప్పనిసరిగా విశాఖ నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. ఏ పార్టీ తరపున పోటీ చేయాలన్న దానిపై సన్నిహితులతో చర్చలు జరుపుతున్నానని తెలిపారు. ఏ పార్టీ తరపున పోటీ చేయకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలపై చర్చ జరగాలని ఆకాంక్షించారు. మునుగోడు ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు చేశారని, ఒక ఎమ్మెల్యే రాజీనామా చేస్తే ఇన్ని కోట్లు ఖర్చు పెడతారా అని ప్రశ్నించారు. రాజీనామా చేసిన వ్యక్తి మళ్ళీ ఎన్నికల్లో పోటీ చెయ్యకూడదు అనే నిబంధనలు రావాలని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు.

## ఉపాకర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వేల రూపాయలు ఆర్థికసాయం



**ఆరిలోవ, (విశాఖ సమాచారమ్):** జీవీఎం 10 వ వార్డు తోటగరువు బి ఎస్ ఆర్ నగర్ లో కుర్మారావు అనే వ్యక్తి ప్రమాదశవాత్తు శరీరం కాలిపోయింది.

ఉపాకర్ గ్రూప్ అధినేత . కంచర్ల అచ్యుతరావు మానవతా దృక్పథంతో చలించి వారి కుమారుడు సిని హీరో కంచర్ల ఉపేంద్ర 10,000 రూపాయలు ఆర్థికసాయం అందించారు.

కంచర్ల ఉపేంద్ర మాట్లాడుతూ ఉపకార్ ట్రస్ట్ తరుపున కంచర్ల అచ్యుతరావు పేదవారికి ఎటువంటి ఆపద వచ్చినవెంటనే సహాయం అందిస్తామని అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ఉపాకర్ ట్రస్ట్ తరుపునఎన్నో చేశామని అని అన్నారు. సంఘ అధ్యక్షులు మాణిక్యాలరావు మాట్లాడుతూ ఉపాకర్ ట్రస్ట్ తరుపున చేస్తున్న సేవలకి మా సంఘం తరుపున ధన్యవాదలు తెలిపారు .

ఈ కార్యక్రమంలో సిని హీరో ఉపేంద్ర బాబు.. ఉపాకర్ ట్రస్ట్ సభ్యులు పాట్టి అప్పారావు, సుధీర్, నాగరాజు పాల్గొన్నారు.

## అమరనాథ్‌చే నేడు యాంకరేజ్ పోర్టులో శంకుస్థాపన

**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** సాగరమాల కార్యక్రమం క్రింద కాకినాడ యాంకరేజి పోర్టు కార్గొ ఎగుమతుల వార్షిక సామర్థ్యాన్ని 3 మిలియన్ టన్నుల స్థాయికి పెంచేందుకు 91 కోట్ల నిధులతో మంజూరు చేసిన పోర్టు అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ పనులకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటి, హాండ్ లూమ్స్, టెక్స్ టైల్స్ శాఖ మంత్రి గుడివాడ అమరనాథ్ శుక్రవారం ఉదయం 10 గంటలకు యాంకరేజి పోర్టులో శంకుస్థాపన చేస్తారు. ఇందులో భాగంగా యాంకరేజి పోర్టులో రెండు మెకానికల్ కార్గొ హాడ్లింగ్ వార్ఫులు, న్యూ పోర్టు ఏరియాలో 5 అదనపు లోడింగ్ పాయింట్ నిర్మాణం, పోర్టు అనుబంధ, అంతర్గత రహదార్ల అభివృద్ధి, కమర్షియల్ కెనాల్ గ్రోయిన్లు, రివిట్ మెంట్ల రిపేర్లు, కమర్షియల్, అప్రోచ్ కెనాల్ ల డ్రెడ్జింగ్ పనులను చేపట్టనున్నారు. ఈ పనులను నిర్వహణకు మెస్సర్స్ విశ్వ సముద్ర హెూల్డింగ్స్ ప్రై.లి., హైదరాబాదు సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రానున్న 12 నెల కాలంలో ఈ పనులను పూర్తి చేయనున్నారు

# టాటా గ్రూప్ లోకి బిస్లరి



భారత్‌లో ప్యాక్డ్ డ్రింకింగ్ వాటర్ బ్రాండ్స్‌లో ఎక్కువ మంది ఎంచుకునే ఆప్షన్స్‌లో బిస్లరి ఒకటి. జర్నీ చేసే సమయంలో బిస్లరి బ్రాండ్ వాటర్ బాటిల్ కొనేందుకు ప్రయాణికులు ఎక్కువగా ఆసక్తి చూపుతుంటారు. అలాంటి.. బిస్లరీ త్వరలో కాలగర్భంలో కలిసిపోనుంది. బిస్లరీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ ఛైర్మన్ రమేష్ చౌహాన్ ఈ సంస్థను టాటాకు విక్రయించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ డీల్ విలువ దాదాపు రూ.6000 కోట్ల నుంచి రూ.7000 కోట్ల మధ్య ఉందని Economic Times రిపోర్ట్ చేసింది. రమేష్ చౌహాన్ ఆరోగ్యం సరిలేకపోవడం, ఆయన కుమార్తెకు బిజినెస్‌పై ఆసక్తి లేకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. టాటా ఇప్పటికిప్పుడు టేకోవర్ చేసుకున్నప్పటికీ ప్రస్తుతం కొనసాగుతున్న మేనేజ్‌మెంట్ రెండేళ్ల పాటు కొనసాగాలన్న ఒప్పందంతో డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. రూ.220 కోట్ల లాభంతో అతి పెద్ద ప్యాక్డ్ డ్రింకింగ్ వాటర్ కంపెనీగా 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి రూ.2,500 కోట్ల టర్నోవర్‌తో కొనసాగుతున్న సంస్థ బిస్లరీ కావడం గమనార్హం.

టాటా ఇప్పటికే ప్యాక్డ్ డ్రింకింగ్ వాటర్ బిజినెస్‌లో హిమాలయన్ బ్రాండ్ పేరుతో, టాటా కాపర్ ప్లస్ వాటర్ బ్రాండ్ పేరుతో మినరల్ వాటర్‌ను టాటా కన్స్యుమర్ ప్రొడక్ట్స్ ఎల్‌టిడి విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. Hydration Segment లో కూడా టాటా గ్లూకో+కు మంచి మార్కెట్ ఉంది. 2021 ఆర్థిక సంవత్సరం నాటికి ఇండియన్ బాటిల్డ్ వాటర్ మార్కెట్ 19,315 కోట్ల రూపాయల బిజినెస్ చేరుకుందని మార్కెట్ రీసెర్చ్ అండ్ అడ్వైజరీ టెకసి రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది.

ఇదిలా ఉండగా.. బిస్లరీని అమ్మేయాలనే నిర్ణయానికి రావడం చాలా బాధ కలిగించిందని, టాటా గ్రూప్ మరింత మెరుగ్గా వ్యాపారాన్ని ముందుకు తీసుకెళుతుందని రమేష్ చౌహాన్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఇతర బయ్యర్ల కంటే టాటా సంస్థ వైపే తాను మొగ్గుచూపడానికి కారణం టాటా గ్రూప్ పాటించే విలువలేనని ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా.. ఈ డీల్‌కు సంబంధించి మాటామంతీ రెండేళ్ల క్రితం నుంచే జరిగినట్లు తెలిసింది.

# అమెరికా వెళ్లాలంటే... మూడేళ్లు ఆగాల్సిందే!

**న్యూఢిల్లీ:** త్వరలో అమెరికా వెళ్లే ఆలోచనలో ఉన్నారా? అయితే సుదీర్ఘ నిరీక్షణకు సిద్ధంగా ఉండండి. దేశంలో బీ-1 (బిజినెస్), బీ-2 (పర్యాటక) వీసాల కోసం మొదటిసారి దరఖాస్తు చేసుకొనే వారికి నిరీక్షణ సమయం దాదాపు మూడేళ్లకు చేరుకుంది. కొవిడ్ అనంతరం అమెరికా వీసాల కోసం ఎదురుచూసే భారతీయుల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అమెరికా విదేశాంగ శాఖ వెబ్‌సైట్ ప్రకారం మంగళవారంనాటికి ఇంటర్వ్యూ అవసరమయ్యే బీ1/బీ2 వీసా దరఖాస్తుదారుల నిరీక్షణ సమయం ముంబై ఎంబసీలో 999 రోజులుగా ఉండగా, హైదరాబాద్‌లో 994, ఢిల్లీ 961, చెన్నై 948, కోల్‌కతా ఎంబసీలో 904 రోజులుగా ఉంది. అంటే తొలిసారి బీ1/ బీ2 దరఖాస్తుదారులు కేవలం ఇంటర్వ్యూ కోసమే 2025 చివరి వరకూ ఎదురుచూడాల్సిన పరిస్థితి. "టూరిస్టు వీసా ఇంటర్వ్యూ కోసం అంతర్జాతీయంగా నిరీక్షణ సమయం 2 నెలల లోపే ఉంది. నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న దరఖాస్తుదారులకు రోజుల వ్యవధిలోనే అపాయింట్‌మెంట్లు అందుబాటులో ఉంటాయి. నిరీక్షణ వ్యవధిని వీలైనంత త్వరగా తగ్గించేందుకు కట్టుబడి ఉన్నాం" అని అమెరికా విదేశాంగ శాఖ మంగళవారం చేసిన ఓ ట్వీట్‌లో పేర్కొంది. వీసా ప్రాసెసింగ్‌ను వేగవంతం చేయడంలో భాగంగా మరింతమంది దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూ మినహాయింపును వర్తింపజేయడంతో పాటు తాత్కాలిక సిబ్బందిని నియమించుకుంటున్నట్లు ఢిల్లీలోని అమెరికా ఎంబసీకి చెందిన సీనియర్ అధికారి తెలిపారు.

# ఐఫోన్ తయారీ ప్లాంట్‌లో తీవ్ర ఉద్రిక్తత




**బీజింగ్:** చైనాలోని యాపిల్ ప్రధాన తయారీ భాగస్వామి అయిన ఫాక్స్‌కాన్‌కు చెందిన ప్లాంట్లలో కార్మికులు బయటకు వెళ్లేందుకు ప్రయత్నించినట్లు పలు వీడియోలు వెలుగులో వచ్చాయి. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన తమ వసతిగృహాల నుంచి బుధవారం వేకువజామున కార్మికుల ఒక్కసారిగా బయటకు వచ్చి నిరసనలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఇది తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. దీనిపై ఫాక్స్‌కాన్ క్షమాపణలు తెలియజేసింది.

దాదాపు నెలన్నర క్రితం కొవిడ్ లాక్‌డౌన్లకు భయపడి అనేక మంది సిబ్బంది జెంగ్‌ఝౌ ప్లాంట్ నుంచి పారిపోయినట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ ప్లాంటులో దాదాపు రెండు లక్షలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో లక్ష మంది బయటకు వెళ్లిపోవడంతో.. కంపెనీ భారీ ఎత్తున కొత్త సిబ్బందిని నియమించుకుంది. తాజాగా వీరే ఆందోళన చేస్తున్నట్లు సమాచారం. నెలక్రితం ఉద్యోగం చేరిన తమని అసలు బయటకు అనుమతించడం లేదని.. పైగా చేసిన పనికి డబ్బులు కూడా చెల్లించడం లేదని పలువురు సామాజిక మాధ్యమాల్లో వీడియోలను పోస్ట్ చేస్తున్నారు.

ఇప్పుడు దీనిపై ఫాక్స్‌కాన్ సంస్థ స్పందించింది. 'ఈ ఘటనపై మా బృందం విచారణ జరుపుతోంది. కొత్త సిబ్బంది నియామక ప్రక్రియలో భాగంగా సాంకేతిక లోపాన్ని గుర్తించాం. ప్రస్తుత ఘటనకు క్షమాపణలు తెలియజేస్తున్నాం. మొదట చెప్పిన విధంగా జీతభత్యాలు చెల్లిస్తాం' అని పేర్కొంది.

**కొసమెరుపు..** "పరిశ్రమలను చైనా నుంచి తరలించాలని తయారీ సంస్థలు యోచిస్తే మనకు ప్రమాదం లాంటిదే. ఇక్కడ స్థిరమైన లేబర్ మార్కెట్‌తో చైనా అతిపెద్ద తయారీదారుగా ఉంది. ఐఫోన్ ఉత్పత్తుల తయారీని భారత్‌కు తరలించినందుకు ఫాక్స్‌కాన్ యాజమాన్యం చింతిస్తుందా..?" అంటూ 2020 డిసెంబర్‌లో గ్లోబల్ టైమ్స్ పాత్రికేయురాలు ట్వీట్ చేశారు. బెంగళూరులోని ఐఫోన్ ఉత్పత్తుల సరఫరాదారు విస్ట్రన్‌లో జరిగిన ఆందోళనను ప్రస్తావిస్తూ ఆమె ఈ వెటకారపు వ్యాఖ్యలు చేశారు. అధిక పనిగంటలు, జీతాలు వంటి అంశాలపై అప్పట్లో నిరసనలు జరిగాయి. కానీ ఇప్పుడు పరిస్థితి తిరగబడింది. చైనాలో కనీస సదుపాయాలు లభించక అక్కడి ఐఫోన్ కర్మాగారంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొన్నట్లు పలు వీడియోలు వెలుగులోకి వచ్చాయి.

# ఆదిత్య పీజీ క్యాంపస్‌లో ఆదిత్య పూర్వ విద్యార్థిచే విద్యార్థులతో పరస్పర అవగాహన సదస్సు



**కాకినాడ, (విశాఖ సమాచారమ్):** ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రాంగణంలో ఆదిత్య మేనేజ్‌మెంట్ ఆహ్వానం మేరకు ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ వీజూ పూర్వ విద్యార్థి యునైటడ్ హెల్త్‌గ్రూపు అసోసియేట్ సాఫ్టవేర్ ఇంజినీరింగ్ మేనేజరు, ఐటీ సెక్టారులో 12 సంవత్యరాల అనుభవం కలిగిన శ్రీ ఎల్లా అశోక్‌కుమార్ గారిచే నిర్వహించబడిన విద్యార్థులతో పరస్పర అవగాహన సదస్సులో ముఖ్యఅతిథులుగా ఆదిత్య విద్యా సంస్థల సెక్రటరి డా॥ యన్. సుగుణారెడ్డి ఆదిత్య డిగ్రీ మరియు పీజి కళాశాలల అకాడమిక్ డైరెక్టర్ డా॥ బి. ఇ. వి. యల్. నాయుడు, ఆదిత్య స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ప్రిన్సిపాల్ డి. బ్యూలా, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీమతి జి. సత్య మరియు వీజూ విద్యార్థిని విద్యార్థులతో పాటు కంప్యూటర్ విభాగం అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఈ సదస్సులో విద్యార్థిని, విద్యార్థులను ఉద్దేశించి ఎల్లా అశోక్‌కుమార్ మాట్లాడుతూ పీ.జి విద్యార్థులు ముఖ్యంగా వీజూ విద్యార్థులు తాము అభ్యసించిన కంప్యూటర్ విద్య యొక్క ప్రాముఖ్యత, ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ ఏలాంటి పాత్ర వహిస్తుందో వివరిస్తూ విద్యార్థులు కంపెనీ ఎంపికలో ఎలాంటి నైపుణ్యం ప్రదర్శించాలో వివరిస్తూ ఎనలిటికల్, లాజికల్, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ఎలా పెంపొందించుకోవాలో వాస్తవిక ఉదాహరణలతో సవివరంగా చెప్పడం జరిగింది. మరియు తన అనుభవరీత్య, అర్థమెటిక్, రీజనింగ్ మరియు కోడింగ్ ఆశక్తి పెట్టాలని, ప్రొగ్రామింగ్ లాంగ్వెజీ ఏదైన కంటెంట్, లాజిక్‌తోపాటు బేసిక్స్ కూడా నేర్చుకోవాలని, కష్టపడే విద్యార్థి ఎపుడూ తప్పక విజయం సాధిస్తాడని విద్యార్థులు తమకు ఇష్టమైన టెక్నాలజీని పూర్తిగా నేర్చుకోవాలని తెలియజేశారు. అనంతరం అవసరమైన డాక్యుమెంట్స్ విద్యార్థులకు ఇవ్వడం జరిగింది.

ఈ కార్యక్రమాన్ని నిర్వహించాడానికి అవకాశమిచ్చిన ఆదిత్య విద్యాసంస్థల అధినేత డా॥. నల్లమిల్లి శేషారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఈ అవగాహన సదస్సులో దాదాపు 200 మంది వీజూ విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఆసక్తిగా పాల్గొన్నడం జరిగిందని, ఇలాంటి అవగాహన సదస్సులు నిర్వహించడం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని ప్రిన్సిపాల్ డి. బ్యూలా తెలియజేశారు.

## ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఈశ్వర్ ఆత్మహత్య

కడప: జిల్లాలోని ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో విషాదఘటన చోటుచేసుకుంది. హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థి ఈశ్వర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు అనంతపురం జిల్లా ఉరవకొండ వాసిగా గుర్తించారు. ఈ ఆత్మహత్య ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు. విద్యార్థి ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు, విద్యార్థి ఆత్మహత్యలో ఏవరి పాత్రయైన ఉందా? లేక ఇతర విషయాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## క్షేత్ర స్థాయి పర్యటనలు, సమీక్షలు నిర్వహించాల్సిందే

**పాడేరు, (విశాఖ సమాచారమ్):** జిల్లా స్థాయి అధికారులు క్రమం తప్పకుండా జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటనలు జరిపి సంబంధిత సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సిందేనని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. నూతన జిల్లాగా అవతరించిన అల్లూరి జిల్లా భారీ గిరిజన ప్రాంతంలో విస్తరించి ఉందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం చివరి లబ్ధిదారు వరకు సంక్షేమ పథకాలను మంజూరు చేసి అమలు చేస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా హౌసింగ్, పెన్షన్లు, రేషన్ పంపిణీ, గడపగడపకు మన ప్రభుత్వం పనులు, ఇతర సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికీ అందేలా నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ సూచించారు. రంపచోడవరం, చింతూరులలో విధులకు సక్రమంగా హాజరుకాని ఉద్యోగులపై ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి తరచూ ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేయాలని, సమీక్షలు నిర్వహించాలని, ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అధికారులు కనీసం రెండు రోజులు రంపచోడవరం ఒక రోజు చింతూరు డివిజన్లలో పర్యటించాలని, పర్యటన లో సంబంధిత కార్యాలయాలను తనిఖీ చేసి శాఖాపరమైన సమీక్షా సమావేశాలను నిర్వహించాలని, సిబ్బంది హాజరును ధృవీకరించాలని, సూచించారు. అదేవిధంగా ఆయా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులను కలవాలని ఆదేశించారు. పర్యటన పూర్తి అయిన తర్వాత పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్ కు తప్పని సరిగా సమర్పించాలని ఆ ఉత్తర్వులలో కలెక్టర్ ఆదేశించారు.

## బెయిల్ మంజూరు పై ఢిల్లీ హైకోర్టులో ఛాలెంజ్ చేసిన సీబీఐ




**న్యూఢిల్లీ:** ఢిల్లీ మద్యం కేసు లో సీబీఐ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. అభిషేక్ బోయి నపల్లి, విజయ్ నాయర్ లకు బెయిల్‌ను రద్దు చేయాలంటూ సీబీఐ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. సీబీఐ పిటిషన్‌పై స్పందించాలని అభిషేక్ బోయి నపల్లి, విజయ్ నాయర్‌లకు నోటీసులు జారీ చేసింది. మద్యం కుంభకోణం వ్యవహారంలో విచారణకు సహకరించలేదని అభిషేక్ బోయినపల్లి, విజయ్ నాయర్‌లను సీబీఐ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కస్టడీలో విచారణ అనంతరం 14 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ తర్వాత ఈ నెల 21న ఇరువురికి రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు బెయిలు మంజూరు చేసింది. ప్రత్యేక కోర్టు మంజూరు చేసిన బెయిల్‌ను సీబీఐ ఢిల్లీ హైకోర్టులో ఛాలెంజ్ చేసింది.

## ఈపీఎఫ్ గరిష్ఠ వేతన పరిమితి 21 వేలు..?

దిల్లీ: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థకు సంబంధించి ప్రభుత్వం త్వరలో ఓ గుడ్‌న్యూస్ చెప్పే అవకాశం ఉంది. పెన్షన్ స్కీమ్‌కు సంబంధించి ఉద్యోగుల గరిష్ఠ వేతన పరిమితిని పెంచే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం రూ.15వేలుగా ఉన్న వేతన పరిమితిని రూ.21 వేలకు త్వరలోనే పెంచనుందని వార్తలు వస్తున్నాయి. ఇదే జరిగితే ఉద్యోగులు, యజమానులు చెల్లించే వాటా పెరగనుంది. దీనివల్ల ఉద్యోగుల భవిష్యనిధి ఖాతాకు జమ అయ్యే మొత్తం ఆ మేర పెరగనుంది.

ప్రస్తుతం ఈపీఎఫ్‌ఓ గరిష్ఠ వేతన పరిమితిని చివరిసారిగా 2014లో సవరించారు. అప్పట్లో రూ.6,500గా ఉన్న గరిష్ఠ వేతనాన్ని రూ.15వేలకు పెంచారు. 20 మంది కంటే ఎక్కువ ఉన్న సంస్థలకు మాత్రమే ఈ నిబంధన వర్తిస్తుంది. తాజాగా ఆ పరిమితిని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం అధిక వేతనం నిర్ణయించేందుకు ఒక కమిటీని ప్రభుత్వం నియమించే అవకాశం ఉంది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి ఎప్పటికప్పుడు గరిష్ఠ వేతన పరిమితిని ఈ కమిటీ సమీక్షించనుంది.

సాధారణంగా ఉద్యోగి వాటాగా వేతనంపై 12 శాతం, యజమాని వాటా 12 శాతం చెల్లిస్తారు. ఉద్యోగి వాటా పూర్తిగా ఈపీఎఫ్ ఖాతాలో జమవుతుంది. యజమాని వాటా నుంచి 8.33 శాతం పింఛను పథకంలో, మిగతా మొత్తం ఈపీఎఫ్ ఖాతాలో జమవుతాయి. ప్రస్తుతం ఉన్న గరిష్ఠ వేతన పరిమితి ప్రకారం.. 8.33 శాతం కింద రూ.1250 ఈపీఎస్ ఖాతాలోకి వెళ్తాయి. మిగతా మొత్తం ఉద్యోగి ఖాతాలో జమవుతాయి. గరిష్ఠ వేతన పరిమితి పెరిగితే ఆ మేర ఉద్యోగి వాటా, యజమాని వాటా పెరుగుతుంది. పెన్షన్ ఖాతాలో ఎక్కువ మొత్తం జమ అవుతుంది.

ప్రస్తుతం లెక్కింపు ఇలా..

ఉదాహరణకు ఒక ఉద్యోగి వేతనం (బేసిక్ ం డీఏ) రూ.30 వేలు ఉందనుకుందాం. ఇందులో ఉద్యోగి వాటా రూ.3600 ఈపీఎఫ్ ఖాతాలో జమవుతాయి. యజమాని వాటా కింద రూ.3600 ఉంటాయి. గరిష్ఠ వేతన పరిమితి రూ.15 వేలును పరిగణనలోకి తీసుకుంటే.. 8.33 శాతం కింద రూ.1250 ఈపీఎస్ ఖాతాలోకి వెళ్తాయి. మిగతా రూ.2350 ఉద్యోగి ఖాతాలో జమవుతాయి. అంటే నెలకు ఉద్యోగి, యజమాని వాటా కింద ఈపీఎఫ్ ఖాతాలో రూ.5950 ఉంటాయి. గరిష్ఠ పరిమితిని 21వేలు చేస్తే ఆ మేర ఈపీఎస్‌లో జమ అయ్యే సుమారు రూ.1750కి పెరగనుంది.

# బాలల హక్కులు పరిరక్షణకు నిరంతర పర్యవేక్షణ



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): బాలల హక్కుల పరిరక్షణకు నిరంతర పర్యవేక్షణతో అడుగులు వేస్తున్నట్టు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మెన్ కేసలి అప్పారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో గురువారం ఉదయం పత్రికా ప్రతినిధులతో కమిషన్ సభ్యులు గొండు సీతారాంతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో తల్లిదండ్రులు, వారి దగ్గర బంధువులు నుండి వివిధ రకాల వేధింపులు, అలాగే వివిధ యాజమాన్యాల పాఠశాలల్లోను, కళాశాలల్లో బాలలపై వేధింపులు, లైంగిక వేదింపులు శారీరక దండనలు, ఒత్తిడిలు సంభందిత ఫిర్యాదులు తమ కమిషన్ కు కోకొల్లలుగా అందుతున్నాయని అన్నారు. వీటిపై చర్యలు చేపట్టేందుకు ఆయా జిల్లాల ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నట్టు గుర్తు చేశారు.

అలాగే కోవిడ్ అనంతరం బాలలపై అన్ని రకాల వేధింపుల ప్రభావం శాతం కూడా అధికంగానే కనిపిస్తోందని అన్నారు. బాలలందరూ సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, వీటిని అదుపు చేసేందుకు తల్లి దండ్రులు మరియు కళాశాలలు, పాఠశాలల యాజమాన్యం నిరంతరం పర్యవేక్షణ పెంచాల్సిన ఆవశ్యకతపై దృష్టి సారించాలని సూచించారు. బాలల కోసం రూపొందించబడ్డ చట్టాలు అమలు జరిగేలా ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలను బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జాగృత పరుస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా బాలల హక్కుల ఉల్లంఘనలు జరిగినట్లు దృష్టికి వస్తే పౌర సమాజం, బాలలు, వారి తల్లిదండ్రులు, బాలల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్న వారు ఫిర్యాదులను apscpcr2018@gmail.com మెయిల్ ద్వారా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్ అధికారి శరత్ కుమార్ జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మెన్ కేసలి అప్పారావు ఫోన్ నెం .9440332581.

# ఘనంగా ప్రారంభమైన చీఫ్ మినిస్టర్ కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు




అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): అనకాపల్లి జిల్లా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికారిక సంస్థ సౌజన్యంతో చీఫ్ మినిస్టర్ కప్ ప్రైజ్ మనీ జిల్లాస్థాయి క్రీడా పోటీలు అనకాపల్లి ఎన్టీఆర్ స్టేడియం గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బీశెట్టి వరహా వెంకట సత్యవతి, అనకాపల్లి మండల పరిషత్ అధ్యక్షులు గొ ర్లి సూరిబాబు, వైకాపా పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ పాల్గొన్నారు. కార్యక్రమానికి నగిరెడ్డి సూర్యారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ అనకాపల్లి జిల్లా, ఎన్ వై కే కోఆర్డినేటర్ మహేష్ , శాప్ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాసరావు, స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఏ శేఖర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కే ఎన్ వి సత్యనారాయణ (పైసా మాస్టర్) ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ రమణ జి , అనకాపల్లి జిల్లా ప్రాధికారిక సంస్థ కోచ్ లు, ఆఫీస్ కోఆర్డినేటర్ వేణుగోపాల్ , జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా మోటూరి నాగేశ్వరావు వ్యవహరించారు.

# స్మశాన వాటికలలో బాధ్యతగా పనిచేయాలి



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): స్మశాన వాటికలో పనిచేయు వారు బాధ్యతగా పని చేయాలని జివిఎంసి కమిషనర్ పి. రాజా బాబు ఆదేశాలు జారీ చేసారు. చావులమదుం స్మశాన వాటికలో పనిచేయుచున్న పి. హెచ్. వర్కర్ పోలారావు పై అభియోగాలు రావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ డాక్టర్ వి సన్యాసి రావు క్షేత్ర స్థాయి విచారణ జరిపి పోలారవుపై వచ్చిన అభియోగాలు ఆధారంగా విచారణ జరిపి 15 రోజుల క్రితమే విధుల నుండి తొలగించడమైనదని తెలిపారు. అంతే కాకుండా అధిక ధరకు స్మశాన వాటికలో కట్టెలు విక్రయిస్తున్నా వ్యాపారునిని కూడా తొలగించడమైనదన్నారు. అంతిమ యాత్ర వాహనాల యొక్క యజమాని / డ్రైవర్ వద్ద నుండి కేవలం వాళ్ళ వాహనం యొక్క రుసుంను మాత్రమే తీసుకోవాలని, ఇతర అంత్యక్రియలకు సంబంధించిన కార్యక్రమాలలో జోక్యం చేసుకొని రుసుం వసూలు చేయకూడదని అలాగే చనిపోయిన వ్యక్తిని తీసుకొని వచ్చిన వాహనాలు గేటు వద్దనే విడిచిపెట్టాలని లోపలకు వాహనాలను తీసుకువెళ్ళకూడదని ఆదేశాలు జారీ చేసారు. అలా కాకుండా అనధికార వ్యక్తులు ఎవరినైనా లోపలకు అనుమతించినా, అసాంఘిక కార్యకలాపాలు చేపట్టినా, లేక ప్రైవేటు వాహనములు లోపలకు అనుమతించినా వారి పై క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. చావులమదుం స్మశాన వాటికలో ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించకూడదని, వాళ్ళ మాటలు నమ్మి మోసపోకూడదని బ్యానర్ లను, బోర్డులను పెట్టడం జరిగినది. అలాగే స్మశాన వాటికలో సి.సి. కెమేరాలు ఏర్పాటు చేయబడినది. దానివల్ల స్మశాన వాటికలో ఇక మీదట ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదని తలిపారు. పై విషయాలను అక్కడకు వచ్చిన వారిని గమనించాగలరని, ఇక ఎటువంటి ఇబ్బంది కలిగిన జివిఎంసి నెంబరు 0891- 7246301కు ఫిర్యాదు చేయగలరని తెలిపారు.

# కంటి పరీక్షలు శత శాతం పూర్తిచేయాలి



అనకాపల్లి, (విశాఖ సమాచారమ్): జిల్లాలో విద్యార్థులకు శత శాతం కంటి పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏ.హేమంత్ పిలుపునిచ్చారు. బుధవారం ఎన్టీఆర్ ఆసుపత్రిలో నిర్వహించిన జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రథమ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా అంతటా నాణ్యమైన సేవలు అందించడం కంటి జాగ్రత్తల పట్ల అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా నేత్రదానం గూర్చి విస్తృత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంధత్వ నివారణకు ప్రైవేటు ఆసుపత్రులు, స్వచ్ఛంద సంస్థలు తమ పూర్తి సహాయ సహకారాలు అందించాలని కోరారు. జిల్లాలో అంధత్వం ఏ మేరకు ఉంది, బాధితులు ఎంతమంది, వారికి ఏ విధమైన చికిత్స జరుగుతున్నది అనే అంశాల పై ఎప్పటికప్పుడు చర్చ జరగాలన్నారు. అంధత్వం గల వారిని గుర్తించి ఐ క్యాంప్స్ ద్వారా మెరుగైన చికిత్స అందించాలన్నారు. కమిటీ కన్వీనర్ డాక్టర్ జి.వి.రమణ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులు పీహెచ్సీల ద్వారా అందజేస్తున్న కంటి వైద్య చికిత్సలు గురించి వివరించారు. జిల్లాలో ఇప్పటివరకు 2158 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేశామన్నారు.50 పాఠశాలలలో 13395 విద్యార్థులకు పరీక్షలు చేసినట్లు తెలిపారు. వారిలో 840 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు పథకంలో 94,494 మంది వృద్ధులకు పరీక్షలు నిర్వహించామని వారిలో 33,313 మందికి కళ్ళజోళ్ళు అందించామని వివరించారు. కంటి జాగ్రత్తలు, అంధత్వ నివారణ పై అవగాహన కలిగించేందుకు ఐ క్యాంప్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాలు మరింత ప్రభావవంతంగా చేపట్టేందుకు సభ్యులు తమ సలహాలు సూచనలు తెలియజేయాలని కోరారు.

ఈ సమావేశంలో ఎన్టీఆర్ ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ పి. శ్రావణ్ కుమార్, సభ్యులు డాక్టర్ కామేశ్వర గుప్తా, డిపిఆర్ఓ డి.సాయిబాబా, కే.దేవుడు, ఎం.నాగమణి, శంకర్ ఫౌండేషన్ కే వేణుగోపాల్, పుష్పశ్రీ ఆసుపత్రి ఎం.ఎస్. రాజు, హైమ ఆసుపత్రి పి.ఎస్.ప్రసాద్ అనిల్ నీరుకొండ ఆసుపత్రి పి.వెంకటేష్ వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శిలదే



పాడేరు, (విశాఖ సమాచారమ్): పంచాయతీ కార్యదర్శులు జిల్లాలో పారిశుధ్య నిర్వహణ బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలో క్షేత్ర స్థాయి పర్యటనలలో జిల్లా వ్యాప్తంగా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేనట్లు గుర్తించడం జరిగిందని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా అమలు చేయాలని కలెక్టర్ తగు సూచనలు జారీ చేశారు. గ్రామాల్లో రోడ్లకిరువైపులా, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల పరిసరాలలో పారిశుధ్యం మెరుగుకు సంబంధిత ఎంపిడిఓలు, విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ అధికారులు, గ్రామ వాలంటీర్లు భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి మండలానికి రెండు ట్రాక్టర్లు అద్దెకు తీసుకుని ఆయా మండల పరిధిలో గల అన్ని గ్రామాల్లో, రోడ్లకు ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు. ట్రాక్టర్ల అద్దెను పంచాయతీ నుంచి లేదా కలెక్టరేట్ నుంచి పొందవచ్చన్నారు. అందుకు బాధ్యత సంబంధిత ఎంపిడిఓ, పంచాయతీ విస్తరణాధికారి చేపట్టాలన్నారు.

ప్రతి పంచాయతీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ బాధ్యత సంబంధిత కార్యదర్శిదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామాల్లో రోడ్లకిరువైపులా మలమూత్ర విసర్జన పూర్తిగా నిషేధించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పర్యాటక కేంద్రాలతో సహాజిల్లా వ్యాప్తంగా పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ విషయాల్లో ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేని వారు సమయానుకూలంగా అందుబాటులో ఉన్న ప్రక్క పంచాయతీ నుంచి కార్మికులను తెప్పించుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

జిల్లా, డివిజన్ స్థాయి పంచాయతీ అధికారులు తమ క్షేత్రస్థాయి పర్యటనలలో జిల్లా కలెక్టర్ ఆదేశాల అమలును పరిశీలించి నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా జారీ చేసిన సూచనాదేశాలు తప్పనిసరిగా పాటించాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తప్పవని ఆదేశించారు. ప్రతి 15 రోజులకు ఒకసారి పారిశుధ్య నిర్వహణపై సమీక్ష నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

# సాధించాలనే తపన యువతను నడిపిస్తుంది



విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్): నూతన ఆవిష్కరణ చేయాలని, నవ్య ఆలోచనలతో పనిచేయాలనే తపన యువత సొంతమని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి అన్నారు. గురువారం ఉదయం ఏయూ జువాలజీ విభాగంలో టికాబ్స్-ఇ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖ లైఫ్‌సైన్సెస్-ఎంటర్‌ప్యూనర్‌షిప్(విఎల్‌ఎస్ఇ) సింపోజియం 2022ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జీవశాస్త్రాలలో పరిశోధనలు ఎంతో కీలకమన్నారు. యువతను ప్రోత్సహించడం, వారిని ఎంటర్‌ప్యూనర్స్‌గా తీర్చిదిద్దడం లక్ష్యంగా తాము పని చేస్తున్నట్లు చెప్పారు. ఏయూలో వృక్ష, జీవ శాస్త్ర విభాగాలకు పూర్వ వైభవం తెస్తున్నామన్నారు. ఈ విభాగాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఉపాధి అవకాశాలను అందుకోవడం జరిగిందన్నారు. కమర్షియల్ పేటెంట్‌లను సాధించే దిశగా టికాబ్స్-ఇ సంస్థ కృషిచేస్తోందన్నారు. ఏయూ పూర్వ విద్యార్థి రవి కిరణ్ చేస్తున్న కృషి అభిలషనీయమన్నారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, జువాలజీ విభాగాధిపతి ఆచార్య జానకీరామ్, టికాబ్స్-ఇ నిర్వాహకులు యేడిది రవికిరణ్, డాక్టర్ రమేష్ బాబు తదితరులు ప్రసంగించారు.


## మోహన వెంకట రెస్ట్ హోమ్స్ (రి)

**ప్రశాంతినగర్, తిరుపతి: ఫోన్ : 9393932718**

మీరు ప్రతీఏటా తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రంలోని శ్రీవేంకటేశ్వర, పద్మావతి అమ్మవార్ల దర్శనం ఇష్టంగా చేసుకుంటూ ఉంటారు. రోజు రోజుకు పెరుగుతున్న భక్తుల కారణంగా ఇప్పుడు తిరుపతిలో గాని, తిరుమలలో గాని వసతి చాలా కష్టమవుతోంది.

ఇలాంటి సమస్యకు పరిష్కారంగా తిరుపతిలో (బస్‌స్టాండ్ రైల్వేస్టేషన్‌లకు కేవలం 8.5 కి.మి. దూరంలో) ప్రకృతి వనరులతో 14 ఎకరాల స్థలంలో ప్రశాంతినగర్ నిర్మాణంలో ఉంది.

అనేక అధునాతన సౌకర్యాలతో సుమారు 500 స్టూడియో అపార్ట్‌మెంట్లు మీకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే 40 అపార్ట్‌మెంట్లతో ఒక బ్లాక్ సిద్ధంగా ఉంది. 24X7 రవాణాసౌకర్యం కూడా యాజమాన్యం కల్పించింది.

సంవత్సరానికి 5 రోజులు ఈ సుఖప్రదమైన ఆవాసం పొందడానికి మీకు ఇప్పుడు చక్కని అవకాశం లభిస్తోంది. కేవలం ఒక లక్షరూపాయలు (+ 18శాతం జీఎస్టీ చెల్లించి) ఒక సింగిల్ బెడ్ అపార్ట్‌మెంట్‌ను మీరు ఒక సంవత్సరంలో 5 రోజులు చొప్పున 12 ఏళ్ల పాటు వినియోగించుకోవచ్చును.

లభించే సదుపాయాలు : ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ సదుపాయం. 24X7 రవాణా సౌకర్యం. మీరు స్వయంగా కూడా వాహనాలు నడపవచ్చు. (2,4 వీలర్ ఎలక్ట్రిక్ వాహనాలు) 24X7 క్లినిక్, గదిలో ఫ్రిజ్, మంచం, పరుపు, ఏసీ, సోఫా, టేబుల్, ఎల్‌పీజీ స్టౌ, గిన్నెలతో సహా కిచెన్.

పూర్తి శాఖాహార భోజన, ఫలహారశాల, అన్నిరకాల వస్తుసామాగ్రి దుకాణములు, వాకింగ్ ట్రాక్, ఈతకొలను, ఔషధ మొక్కలతో కూడిన వనసంపదల ఉద్యానవనం. అహ్లాదకరమైన ఆధ్యాత్మిక సంగీతభరిత వాతావరణం, ఉచిత వైఫై లభిస్తాయి.

**24×7 రక్షణ, లాండ్రీ, ఇతర సేవలు లభిస్తాయి.**

**వివరములకు సంప్రదించండి.**

**9393949345, 8247526179**


VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press Door No. 9-3-16,Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, Hyderabad : Cell : 9030841841, Kakinada : Cell: 7013118088, Simhachalam : Cell: 96526 99699, Paravaada : Cell: 77804 33919, Aarilova : Cell: 97050 51389, Cheedikaada : Cell: 97686 33999.